# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగు దినపత్రిక | సంపుటి :02 | సంచిక : 237 | మంగళవారం 12 ఆగస్టు 2025 | పేజీలు: 08 | వెల రూ.5

PUBLISHED FROM : KARIMNAGAR : CIRCULATED TO : ADILABAD, WARANGAL, NIZAMABAD, HYDERABAD,KHAMAM, NALGONDA, MAHBUBNAGAR,MEDAK, RANGAREDDY



## రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలలో సంప్రదించగలరు.

97051 46268 77805 51339
98491 98098




## ఎంపీలకు 184 నూతన ఫ్లాట్‌లు..

3

**కొత్త నివాస సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ**



## 'పార్లమెంట్ టు ఈసీ' ర్యాలీ ఉద్రిక్తతం

2

**ఎంపీల ర్యాలీకి పోలీసుల అనుమతి నిరాకరణ**

**ర్యాలీని అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు**



## సీఎంతో పీసీసీ చీఫ్ భేట

*** బీసీ రిజర్వేషన్లు, తాజా రాజకీయాలపై చర్చ**

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల అంశాలపై గంటన్నరకుపైగా సాగిన ఈ సమావేశంలో పలు కీలక విషయాలపై చర్చ జరిగింది. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే చర్యలపై నేతలిద్దరూ చర్చించారు. ఈ నెల 16 లేదా 17న పీసీసీ, పీఏసీ భేటీ నిర్వహించే అవకాశం ఉందని తెలిసింది. ఆ సమావేశంలో మెజారిటీ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోనున్నారు. ముఖ్యంగా 42 శాతం బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. బోర్డు, కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకాలను త్వరగా చేపట్టాలని కూడా ఈ భేటీలో నిర్ణయించినట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికలో పార్టీ వ్యూహాలు, జనహిత పాదయాత్రలో ప్రజా విజ్ఞప్తుల పరిష్కారాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

## సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

**ఎన్నికల కేసును కొట్టివేసిన హైకోర్టు**

2

# పార్లమెంట్‌లో అదే రభస

## బీహార్ వ్యవహారంపై చర్చకు పట్టు

## వాయిదా పడిన ఉభయ సభలు

## అనుమానాల నివృత్తిపై భేటీకి ఈసీ సమ్మతి



**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :** ప్రతిపక్షాల ఆందోళలతో పార్లమెంట్ దద్దరిల్లింది. సోమవారం ఉదయం ఉభయ సభలు ప్రారంభం కాగానే బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ఆందోళనకు దిగాయి. బీహార్ ఓటర్ల జాబితా సవరణపై చర్చ నిర్వహించాల్సిందేనని పట్టుబట్టాయి. బీజేపీతో ఈసీ కుమ్మక్కైందని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశాయి. స్పీకర్ సముదాయించే ప్రయత్నం చేసిన విపక్షాలు వెనక్కి తగ్గలేదు. సభలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో పార్లమెంట్ ఉభయ సభలను మధ్యాహ్నం 2 గంటల వరకు మిగతా 2వ పేజీలో..



## జగదీప్ ధన్‌ఖడ్ ఆచూకీ తెలపండి

**ఆయన ఆరోగ్యంపై మాకు ఆందోళనగా ఉంది**

**ఆయనతో మాట్లాడాలని అనుకున్నా సాధ్యం కాలేదు**

**హోంమంత్రి అమిత్ షాకు శివసేన ఎంపీ సంజయ్ రాత్ లేఖ**

2

## పాక్ ఆర్మీచీఫ్ అణు ప్రేలాపనలు

**పాక్ కుతంత్రాలను ప్రపంచం గమనిస్తోంది**

**తిప్పి కొట్టిన భారత విదేశాంగ శాఖ**

2



## వచ్చే 3 రోజులు భారీ వర్షాలు

**హెచ్చరిక జారీ చేసిన భారత వాతావరణ శాఖ**

3

## సివిల్స్ అభ్యర్థులకు అన్నిరకాలుగా సాయం చేస్తాం: భట్టి విక్రమార్క

## కాగ్ త్రైమాసిక నివేదిక

*** ఆదాయం తగ్గడంపై కేటీఆర్ విమర్శలు**




**హైదరాబాద్,ఆగస్ట్11 :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాగ్ క్వార్టర్లీ రిపోర్టుపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాగ్ త్రైమాసిక నివేదిక ప్రకారం రాష్ట్ర ఆదాయం బాగా తగ్గిందని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గడం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో ఆర్థిక రంగం దెబ్బతింటోంది. ఆరు గ్యారెంటీల కాంగ్రెస్ హామీ.. ఆర్థిక రంగానికి నష్టం చేసింది. రాష్ట్ర ఆదాయం తగ్గుతుంటే.. అప్పులు మాత్రం పెరుగుతున్నాయి. రూ. 2,738 కోట్ల మిగులు ఉంటుందని బడ్జెట్‌లో చూపారు. మొదటి త్రైమాసికానికే రూ. 10,583 కోట్ల రెవెన్యూ లోటు ఉంది. మూడు నెలల్లోనే రూ. 20,266 కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఒక్క రోడ్డు వేయలేదు.. ఒక్క కొత్త ప్రాజెక్టు కట్టలేదు. ఆర్థిక రంగాన్ని ఎలా గాడిన పెడుతారో కాంగ్రెస్ ఆర్థిక నిపుణులు చెప్పగలరా..? అని కేటీఆర్ నిలదీశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికే ముఖ్యం

3

**మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు**

**స్పీకర్ పరిధిలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం**

**మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**



### ఫామ్‌హౌజ్‌లో కేటీఆర్, హరీశ్‌లతో

## కేసీఆర్ మంతనాలు



*** కాళేశ్వరం నివేదిక తదితర అంశాలపై చర్చ**

*** బీజేపీలో విలీనం అంటూ వస్తున్న వార్తలపైనా ఆరా**

**గజ్వేల్,ఆగస్ట్11 :** కాళేశ్వరం నివేదక తరవాత మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వరుసగా పార్టీ ముఖ్యులతో భేటీ అవుతున్నారు. ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తన ముఖ్య అనుచరులతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ రిపోర్టుకు సంబంధించి సుప్రీంకోర్టుకు వెళ్లే విషయంపై వారు కూలంకుషంగా చర్చించారు. అలాగే ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై సైతం సుప్రీంకోర్టుకు వెళ్లాలని వారంతా నిర్ణయించారు. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పామ్‌హౌస్ సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. అదే విధంగా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం అంటూ జరుగుతున్న ప్రచారాన్ని మిగతా 2వ పేజీలో..



## హైదరాబాద్‌లో మరోమారు భారీ వర్షం

**అప్రమత్తం అయిన సహాయక బృందాలు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక**

2

## హైడ్రా మార్షల్స్ జీతాలు తగ్గవు

**ముందుందు మరింత పెరుగుతాయి**

**హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ**

3

## నిషేధిత జాబితాలో మరిన్ని పార్టీలు

**రెండోదశలో 476 పార్టీలను గుర్తించిన ఈసీ**



# పార్లమెంట్‌లో అదే రభస

మొదటి పేజీ తరువాయి

వాయిదా వేశారు. మరోవైపు.. ఓట్ల చోరీ జరుగుతుదంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఈసీ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో ఇండియా కూటమిలోని 25 ప్రతిపక్ష పార్టీల నుంచి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొననున్నారు. అయితే, ఇండియా కూటమి నేతల ర్యాలీకి ఢల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఇండియా బ్లాక్ ఎంపీల ర్యాలీపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలావుంటే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లో జరుగుతున్న ఎలక్టోరల్ రోల్స్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సరిగా లేదని ఆరోపిస్తూ ఇండియా కూటమి భారీ ఆందోళనకు సిద్ధమైంది. సోమవారం ఢల్లీలోని పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం ఆఫీస్ వరకు 300 మందికి పైగా ఎంపీలు ర్యాలీ చేయబోతున్నారు. అయితే, ఈ ర్యాలీకి ఢల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ర్యాలీ నిర్వహణకు సంబంధించి తమకు ఎలాంటి అధికారిక వినతి అందలేదని సీనియర్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇండియా కూటమి మాత్రం ర్యాలీ నిర్వహించి తీరాలని నిర్ణయించారు. ఇలాంటి సమయంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రతిపక్ష పార్టీ నేతలతో భేటీకి ఎన్నికల సంఘం అంగీకరించింది. కాంగ్రెస్ సీనియర్ నేత, పార్లమెంట్ సభ్యుడు జైరాం రమేష్ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. భేటీకి అవకాశం ఇవ్వాలని కోరారు. జైరాం రమేష్ లేఖపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు జైరాం రమేష్‌కు ఎన్నికల సంఘం సెక్రటరీ అశ్వినీ కుమార్ మోహల్ ఆదివారం రాత్రి లేఖ రాశారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. ఎక్కువ మంది పట్టే అవకాశం లేనందున కేవలం 30 మందికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సుకుమార్ సెన్ హాల్‌లో సమావేశం జరగనుంది. అయితే, ఎన్నికల సంఘం భేటీకి అంగీకరించిన నేపథ్యంలో ర్యాలీపై ఇండియా కూటమి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. కాగా, 2024 ఎన్నికల్లో కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో దాదాపు 1,00,250 ఓట్లు చోరీ అయ్యాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు.

## ఫామ్‌హౌజ్‌లో కేటీఆర్, హరీశ్‌లతో
# కేసీఆర్ మంతనాలు

మొదటి పేజీ తరువాయి

తిప్పికొట్టాలని ఈ సందర్భంగా పార్టీ కీలక నేతలకు అధినేత కేసీఆర్ స్పష్టమైన సూచన ఇచ్చినట్లు సమాచారం. రూ. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. దాదాపు 15 నెలల పాటు విచారించిన ఈ కమిషన్.. ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈ నివేదికలో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో అంతా బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కీలకమని స్పష్టం చేసినట్లు కథనాలు వెల్లువెత్తాయి. దీనిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సిట్ నివేదిక ఆధారంగా దోషులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ అంశంపై సుప్రీం కోర్టుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం.. ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ అంశంపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కేటీఆర్‌తోపాటు పలువురు నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కోర్టు తీర్పుపై సంతృప్తి చెందని ఆ పార్టీ నేతలు.. సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించారని సమాచారం. మరోవైపు బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ఒక ప్రచారం అయితే ఉధృతంగా సాగుతోంది. ఈ ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే ఖండిరచింది.

# జగదీప్ ధన్‌ఖడ్ ఆచూకీ తెలపండి





* ఆయన ఆరోగ్యంపై మాకు ఆందోళనగా ఉంది
* ఆయనతో మాట్లాడాలని అనుకున్నా సాధ్యం కాలేదు
* హోంమంత్రి అమిత్ షాకు శివసేన ఎంపీ సంజయ్ రౌత్ లేఖ

న్యూఢిల్లీ,ఆగస్ట్11 :

రాజీనామా చేసిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడం ఆచూకీ చెప్పాలంటూ శివసేన నేత సంజ్రయౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరారు. ఆయనతో సంప్రదించాలని చూసినా ఆయన ఎక్కడున్నారో తెలియడం లేదన్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అనారోగ్య కారణాలతోనే పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. దీనిపై విపక్షాలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాల వేళ తాజాగా శివసేన (యూబీటీ) సీనియర్ నేత సంజయ్ రౌత్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ధన్‌ఖడ్‌ను తాము ఫోన్‌లో కూడా కలవ లేకపోతున్నామని, ఆయన ఎక్కడున్నారో చెప్పాలని కోరారు. మన మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఎక్కడున్నారన్న దానిపై ఎలాంటి సమాచారం లేదు. ఆయన ప్రస్తుత లొకేషన్ ఏంటి? ఆయన ఆరోగ్యం ఎలా ఉంది?వంటి ప్రశ్నలపై స్పష్టత రావట్లేదు. ధన్‌ఖడ్‌తో మాట్లాడేందుకు కొంతమంది రాజ్యసభ సభ్యులు ప్రయత్నించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఆయనను, ఆయన సిబ్బందిని సంప్రదించలేకపోతున్నాం. ఇది చాలా ఆందోళనకరం. ధన్‌ఖడ్‌కు ఏం జరిగింది? ఆయన క్షేమంగానే ఉన్నారా? ఆరోగ్యంగానే ఉన్నారా? ఈ ప్రశ్నలపై దేశ ప్రజలకు సమాధానం కావాలని సంజయ్ రౌత్ తన లేఖలో ప్రశ్నించారు. ఈ లెటర్‌ను సంజయ్ రౌత్ ఆదివారం పంపించగా.. సోమవారం ఎక్స్ ఖాతాలో దీని గురించి పోస్ట్ చేశారు. ధన్‌ఖడ్ ఎక్కడున్నారో తెలుసుకునేందుకు సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాలని అనుకుంటున్నట్లు ఎంపీ సంజయ్ రౌత్ వెల్లడిరచారు. సుప్రీంకోర్టుకు వెళ్లేముందు దీనిపై మీ నుంచి సమాచారం కోరడం ఉత్తమమని భావించాం. మా ఆందోళనలను అర్థం చేసుకుని మాజీ ఉపరాష్ట్రపతి ఆచూకీ చెబుతారని విశ్వసిస్తున్నాం అని శివసేన ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు. గతవారం పలువురు విపక్ష నేతలు కూడా ధన్‌ఖడ్ సమాచారం కోసం కేంద్రాన్ని ప్రశ్నించారు. జులై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే ధన్‌ఖడ్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజు ఉదయమంతా రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన.. రాత్రికల్లా అనూహ్య నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి దిగిపోతున్నట్లు తెలిపారు.

# పాక్ ఆర్మీచీఫ్ అణు ప్రేలాపనలు

* పాక్ కుతంత్రాలను ప్రపంచం గమనిస్తోంది
* తిప్పి కొట్టిన భారత విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ,ఆగస్టు11 :



అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్.. అక్కడి నుంచే భారత్‌పై అణు బెదిరింపులకు పాల్పడి క్రమంలో ఆయన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండిరచింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు దాయాది తన అసలు రంగు చూపిస్తోందని మండిపడిరది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ శాఖ దీనిపై ప్రకటన విడుదల చేసింది. అణ్వాయుధాల వినియోగంపై బెదిరింపులు పాక్‌కు అలవాటే. ఇలాంటి వ్యాఖ్యలతో ఆ దేశం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తోందో అంతర్జాతీయ సమాజం అర్థం చేసుకోవాలి. పాక్ అణ్వాయుధా లపై ఎవరి నియంత్రణ ఉందో దీన్ని బట్టి స్పష్టమవుతోంది. అక్కడ సైన్యం, ఉగ్ర మూకలతో చేతులు కలిపింది. అమెరికా గడ్డపై మునీర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం విచారకరం. అయితే, ఇలాంటి అణు బెదిరింపులకు భారత్ భయపడదు. దేశ భద్రత కోసం ఎలాంటి చర్యలకైనా వెనుకాడబోం అని విదేశాంగ శాఖ తమ ప్రకటనలో వెల్లడిరచింది. అంతకుముందు కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వర్గాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్ మిలిటరీకి అమెరికా మద్దతిచ్చినప్పుడల్లా.. వారు తమ నిజస్వరూపాన్ని బయటపెడుతూనే ఉంటారు. పాక్‌లో ప్రజాస్వామ్యం లేదని దీన్ని బట్టి చూస్తే తెలుస్తోంది. ఆ దేశాన్ని సైన్యమే నియంత్రిస్తోంది. పాక్ వద్ద ఉన్న అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. అదే జరిగితే ఈ ప్రాంతంతో పాటు ప్రపంచం మొత్తానికి ముప్పు ఎదురైనట్లే అని భారత ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఎ`లోరిడాలో ఓ కార్యక్రమంలో మాట్లాడిన మునీర్.. భారత్‌పై మరోసారి నోరుపారేసు కున్నారు. తమది అణ్వాయుధ సామర్థం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో న్యూదిల్లీ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే.. తమతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ ప్రేలాపనలు చేశారు. కాగా.. మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి. భారత్‌పై ట్రంప్ సుంకాల భారం మోపుతున్న వేళ మునీర్ అగ్రరాజ్యంలో పర్యటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే తమతో పాటు సగం ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తామంటూ తన అధికారిక పర్యటనలో ప్రకటించటం ప్రకంపనలు సృష్టిస్తోంది. విచక్షణ లేకుండా నోటికి వచ్చినట్లు వ్యాఖ్యలు చేయటం ప్రపంచ భద్రతకు ముప్పని మునీర్ వ్యాఖ్యలను మాజీ భారత ఆర్మీ మేజర్ జనరల్ జిడి బక్షి ఖండిరచారు . పిచ్చెక్కిన మునీర్ అణుదాడి చేస్తామంటూ బెదిరించటాన్ని బక్షి కొట్టిపడేశారు. అలాగే సిందు నదిపై నిర్మించే డ్యామ్ మిసైళ్లతో కూల్చేస్తామంటూ డప్పాలు బాదటం ఆయనను మరోసారి నవ్వులపాలు చేస్తోంది.ఇటీవల మే నెలలో భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ మిస్సైళ్లను భారత భద్రతా వ్యవస్థలు కూల్చేసిన విషయాన్ని మునీర్ మర్చిపోయారని అన్నారు బక్షి. సిందూర్ సమయంలో పాక్ మూడు బ్యాలెస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించగా 100 శాతం వాటిని భారత్ అడ్డుకుందని అన్నారు. అలాగే పాక్ పంపిన వెయ్యి డ్రోన్లలో 90 శాతం నిరోధించబడ్డాయని బక్షి చెప్పారు. 3వ అణుయుగంలో ఇంటిగ్రేటెడ్ ఆఉ వ్యవస్థల పూర్తి సామర్థం పాకిస్తాన్ వంటి చిన్న దేశాలు కలిగి ఉన్న అణ్వాయుధ స్థావరాలను మట్టికరిపిస్తాయని అన్నారు బక్షి. ఈ పిచ్చి ముల్లా సగం ప్రపంచాన్ని తనతో తీసుకెళ్లకుండా అమెరికా నిరోధించాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ జనరల్ బక్షి పిలుపునిచ్చారు. మునీర్ ప్రసంగం కాశ్మీర్ పై పెరుగుతున్న శత్రుత్వానికి అద్దం పడుతోంది. ఇంత నిర్లక్ష్యంగా ఒక దేశ ఆర్మీ చీఫ్ మాట్లాడటాన్ని భారత్ కూడా ఖండిస్తోంది. విదేశాలను బెదిరించటానికి పాక్ ఎప్పుడు పాత న్యూక్లియర్ దాడి పాడటాన్ని ప్రపంచ నేతలు కూడా తప్పు పడుతున్నారు. ఇదంతా చూస్తుంటే మునీర్ అమెరికా పర్యటనను మీడియా కవరేజ్ కోసం కారుకూతలు కూస్తున్నాడా అనే అనుమానాలను కూడా కొందరు సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు.

## తెలంగాణలో ఓటు చోరీపై జవాబివ్వాలి

* కెటిఆర్ డిమాండ్

హైదరాబాద్,ఆగస్ట్11 :

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ప్రభుత్వంపై మరోసారి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఫైరయ్యారు. తెలంగాణలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఓటు చోరీ చేశారన్నారు. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ’ఓటర్ చోరీ’ జరిగిందంటూ నిరసన వ్యక్తం చేస్తూ ఇండియా బ్లాక్ ఎంపీలు పార్లమెంట్ నుండి ఎన్నికల కమిషన్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ మార్చ్‌లో 25 ప్రతిపక్ష పార్టీల నుండి 300 మందికి పైగా ఎంపీలు పాల్గొన్నారు.ఈ ర్యాలీపై కెటిఆర్ స్పందిస్తూ.. కాంగ్రెస్ విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలపై రాహుల్ గాంధీని కెటిఆర్ నిలదీశారు. తెలంగాణలో రాహుల్ గాంధీ చేసింది కూడా ఓటు చోరీ కాదా? అంటూ ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో 420 హామీలు 100 రోజుల్లోపు అమలు చేస్తామని చెప్పి గెలిచి.. ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ఉండటం ఓటు చోరీ కిందకి రాదా అని మండిపడ్డారు.

# కృష్ణా పరివాహకంలో భారీ వర్షాలు

* జలకళ సంతరించుకున్న ప్రాజెక్టులు

హైదరాబాద్,ఆగస్ట్11 :

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా పరీవాహక ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు క్రమంగా వరద నీరు పెరుగుతోంది. శ్రీశైలం ఇన్‌ఫ్లో 1,99,714 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఎ`లో 1,00,800 క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,485 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 881.20 అడుగుల నీటిమట్టం ఉంది. పూర్తి నీటినిల్వ సామర్థం 215.80 టీఎంసీలకు గానూ.. ప్రస్తుతం 194.30 టీఎంసీల నీరు ఉంది. మరోవైపు నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండను తలపిస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద ప్రభావం పెరిగింది. దీంతో 8 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 64,465 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 65,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. 1,10,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి, ప్రస్తుత నీటి మట్టాలు 590 అడుగులుగా ఉన్నాయి. సాగర్ పూర్తి నీటి నిల్వ సామర్థం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం అంతే స్థాయిలో నీరు నిల్వ ఉంది. తెలుగు రాష్ట్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో జలాశయాలకు భారీగా వరద నీరు చేరుకుంది. వరద చేరుకోవడంతో పలు ప్రాజెక్ట్‌ల గేట్లు తెరిచారు. నాగార్జునసాగర్, హిమాయత్ సాగర్, శ్రీరాంసాగర్, మూసీ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం జలాశయాల్లో భారీగా వరద ప్రవహిస్తోంది. ఈ జలాశయాల దగ్గర ప్రస్తుత నీటి పరిస్థితి ఇలా ఉంది. హిమాయత్ సాగర్‌కు వరద నీరు మళ్లీ పెరిగింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు హిమాయత్ సాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. వరద నీరు పెరగడంతో రెండో గేట్‌ను మూడు ఫీట్ల మేర ఎత్తారు. ఇప్పటి వరకు ఒక్క గేటు మాత్రమే అధికారులు తెరిచి నీటిని విడుదల చేశారు. హుస్సేన్ సాగర్ డేంజర్ బెల్స్ మోగిస్తుండటంతో ప్రమాదకరస్థాయిలో హుస్సేన్ సాగర్‌కు భారీగా వరద నీరు చేరుకుంది. హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటింది. ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్‌కు వరద పోటెత్తుతోంది. బంజారాహిల్స్, బుల్కాపూర్, పికెట్, కూకట్‌పల్లి నాలాల నుంచి హుస్సేన్ సాగర్‌లోకి వరద వస్తోంది. తూముల ద్వారా హుస్సేన్ సాగర్ నుంచి నీటిని అధికారులు మూసీలోకి వదులుతున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంత ప్రజలను జీవహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. తిరిగి క్ష సర్వీస్ రోడ్డును అధికారులు మూసివేశారు. వరద ప్రవాహంతో రాజేంద్ర నగర్, హిమాయత్ సాగర్ వైపు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మూసీ పరీవాహక ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

# హైదరాబాద్‌లో మరోమారు భారీ వర్షం



* అప్రమత్తం అయిన సహాయక బృందాలు
* అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్11 :

హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురుసింది. సాయంత్ర నల్లని మేఘావృతం ఆవరించింది నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొటటింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ, మూసాపేట్‌లో భారీ వర్షం పడుతుంది. కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్‌లో మోస్తారు వర్షం కురిసినట్లు సమాచారం. వర్షాలతో ఎక్కడికక్కడ మెట్రో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. రహదారులన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో మాన్సూన్ బృందాలు అప్రమత్తమయ్యాయి. ప్రజలు బయటకు రావద్దని మరోమారు హెచ్చరికలు చేశారు. వచ్చే నాలుగైదు రోజులు భారీ అతి భారీ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశమున్న క్రమంలో జిల్లా యంత్రాంగంతో పాటు హైదరాబాద్ అధికారులను అలర్ట్ చేసింది వాతావరణ శాఖ. భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది వాతావరణ శాఖ.అక్కడక్కడ భారీ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్ళద్దని సూచించింది.ఇప్పటికే జిహెచ్ఎంసి హైడ్రా మాన్సూన్ డిఆర్ఎఫ్, పోలీస్, ట్రాఫిక్ కి ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది వాతావరణ శాఖ. ముప్పు ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, మూసి పరవాహక ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించింది. రానున్న నాలుగైదు రోజులపాటు హైదరాబాద్ తో పాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉపరిత ఆవర్తనం కారణంగా వర్షాలు కురుస్తున్నాయని.. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని... దీంతో 13వ తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాల తీవ్రత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 13, 14 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 14వ తేదీ ఒకటి రెండు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఇదిలా ఉండగా.. ఇవాళ భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. మిగతా అన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది ఐఎండీ. ఈ క్రమంలో మంగళవారం 12 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. 13, 14 తేదీల్లో హైదరాబాద్ లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# పార్లమెంట్ టు ఈసీ ర్యాలీ ఉద్రిక్తతం

* ఎంపీల ర్యాలీకి పోలీసుల అనుమతి నిరాకరణ
* ర్యాలీని అడ్డుకుని బస్సుల్లో తరలించిన పోలీసులు

న్యూఢిల్లీ,ఆగస్ట్11 :

బిహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు చేపట్టిన ’పార్లమెంట్ టు ఈసీ’ ర్యాలీ ఉద్రిక్తతంగా మారింది. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. బిహార్‌లో ఓట్ల జాబితా సవరణకు నిరసనగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు ఈ ర్యాలీ చేపట్టారు. పార్లమెంట్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి బయల్దేరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ’ఓట్ల చోరీ’ జరిగిందంటూ ఎంపీలు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ అఖిలేశ్ యాదవ్ సహా దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ విపక్ష ఎంపీలు పాల్గొన్నారు. అయితే.. ఈ ర్యాలీకి ఎలాంటి ముందస్తు అనుమతి తీసుకోకపోవడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. సంసద్ మార్గ్‌లో భారీగా పోలీసులు మోహరించారు. ఈ రహదారిని బ్లాక్ చేసి బారికేడ్లు పెట్టారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అఖిలేశ్ యాదవ్ సహా కొంతమంది ఎంపీలు బారికేడ్లు దూకేందుకు యత్నించారు. వాటిపైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని నిలువరించారు. విపక్ష ఎంపీలు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బస్సుల్లో అక్కడి నుంచి తరలించారు. పార్లమెంట్ భవన్ నుంచి ఈసీ ఆఫీస్‌కు మార్చ్ చేపట్టింది. విపక్ష ఎంపీలంతా ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రానికి, ఈసీకి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. వ్యతిరేక నినాదాలు చేశారు. అయితే అనుమతి లేదంటూ బారికేడ్ల దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో ఎంపీలు వాగ్వాదానికి దిగారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతలో మహిళా ఎంపీలు, అఖిలేష్ యాదవ్ బారికేడ్లు దూకే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే ఆశ్చర్యంలో కాంగ్రెస్‌తో అంటీముట్టనట్టుగా ఉండే శశిథరూర్ అనూహ్యంగా రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు, బిహార్ సమగ్ర సవరణ సర్వే సహా పలు అంశాలపై మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఈసీకి లేఖ రాశారు. ఇందుకు అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం.. విపక్షాలతో భేటీకి అంగీకరించింది.

# సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

* ఎన్నికల కేసును కొట్టివేసిన హైకోర్టు

హైదరాబాద్,ఆగస్టు11 :

సీఎం రేవంత్‌రెడ్డిపై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. 2019 అక్టోబర్‌లో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి పీఎస్‌లో ఆయనపై కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని నమోదైన ఈ కేసును కొట్టేయాలని రేవంత్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ కె.లక్ష్మణ్ కేసును కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే రేవంత్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు దాఖలు చేసిన పిటిషనర్ పెద్దిరాజుకు సుప్రీంకోర్టు అక్షింతలు వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు అఫిడవిట్ రూపంలో క్షమాపణలు చెప్పాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఆదేశించింది. రేవంత్‌రెడ్డిపై పెద్దిరాజు దాఖలు చేసిన కేసును గతంలో తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఆ కేసును నాగ్‌పూర్ బెంచ్‌కు బదిలీ చేయాలని సుప్రీంకోర్టులో పెద్దిరాజు ట్రాన్స్‌ఫర్ పిటిషన్ దాఖలు చేశారు. అందులో హైకోర్టు న్యాయమూర్తిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. పిటిషన్ డ్రాఫ్ట్ చేసిన ఏఓఆర్, పెద్దిరాజుపై సీజేఐ ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మౌసమి భట్టాచార్యకు క్షమాపణలు చెప్పాలని తెలిపింది. క్షమాపణ చెపుతూ దాఖలు చేసే అఫిడవిట్‌పై నిర్ణయాన్ని జస్టిస్ మౌసమి భట్టాచార్యకు వదిలేసింది. వారం రోజుల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని పెద్దిరాజుకు ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# షేధిత జాబితాలో మరిన్ని పార్టీలు

* రెండోదశలో 476 పార్టీలను గుర్తించిన ఈసీ

**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :**

చట్టబద్ధతను పాటించని రాజకీయ పార్టీలపై ఈసీ కఠిన చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా మరో 476 పార్టీలను రద్దు చేసే దిశగా చర్యలను మొదలు పెట్టినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడిరచింది. ఇటీవల 334 పార్టీలను రద్దు చేసిన ఈసీ.. తాజాగా రెండో రౌండ్‌లో మరో 476 పార్టీలను గుర్తించి.. వాటిపై వేటు వేసే ప్రక్రియను కొనసాగిస్తోంది. తాజాగా డీలిస్ట్ చేసేందుకు గుర్తించిన పార్టీల జాబితాలో ఏపీ నుంచి 17 పార్టీలు ఉండగా.. తెలంగాణ నుంచి 9 పార్టీలు ఉన్నట్లు ఈసీ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు చేపట్టిన సమగ్రమైన వ్యూహాల్లో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఈసీ పేర్కొంది. 2019 నుంచి ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనైనా పోటీ చేయని రాజకీయ పార్టీలను గుర్తించి, జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపింది. ఇందులో భాగంగానే తొలి రౌండ్‌లో ఆగస్టు 9న 334 పార్టీలను జాబితా నుంచి తొలగించగా.. రెండో దశలో మరో 476 పార్టీలను గుర్తించినట్లు వెల్లడిరచింది. తాము డీలిస్ట్ చేసిన పార్టీలేవీ.. ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 29సీ, 29బీ ఆదాయ పన్ను చట్టం1961, ఎన్నికల గుర్తులు ఆర్డర్ 1968 కింద ఉన్న ప్రయోజనాలను పొందలేవని ఈసీ స్పష్టం చేసింది.

# హైడ్రా మార్షల్స్ జీతాలు తగ్గవు

* ముున్మందు మరింత పెరుగుతాయి
* హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టీకరణ

**హైదరాబాద్,ఆగస్ట్11 :**

రాష్ట్ర ప్రభుత్వం జీతాలు తగ్గించడంపై హైడ్రా మార్షల్స్ ఆందోళన చేపట్టారు. విధులను బహిష్కరించి తమకు న్యాయం చేయాలని నిరసన వ్యక్తం చేశారు. దీంతో హైడ్రా కంట్రోల్ రూమ్ సేవలతోపాటు ట్రైనింగ్, ప్రజావాణి సేవలు నిలిచిపోయాయి. ఈ విషయంపై తాజాగా.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. హైడ్రా మార్షల్స్ ఆందోళనపై ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. హైడ్రా మార్షల్స్ ఆందోళన టీ కప్పులో తుఫాను లాంటిదని కమిషనర్ రంగనాథ్ చెప్పుకొచ్చారు. జీవో ప్రకారం ఒక స్కేల్ జీతం విడుదల చేశారని తెలిపారు. హైడ్రాలో పనిచేస్తున్న వారి జీతాలు తగ్గే అవకాశం లేదని స్పష్టం చేశారు. చిన్న కన్ఫ్యూజన్‌తో మార్షల్స్ ఆందోళన చెందారని వివరించారు. అందరికి అర్థం అయ్యేలా వివరించామని పేర్కొన్నారు. వాళ్ళు కూడా సంతోష పడ్డారని చెప్పారు. హైడ్రాలో పని చేస్తున్న మార్షల్‌స్‌కి ఇంకా జీతం పెరుగుతుందని రంగనాథ్ వెల్లడిరచారు.
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ కూడా.. జీతాలు పెంచే అంశంపై పరిశీలన చేస్తుందని తెలిపారు. హైడ్రా మార్షల్స్ పట్ల ఏ అధికారి అమర్యాదగా ప్రవర్తించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలా ఎవరైనా చేస్తే.. నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని భరోసా ఇచ్చారు. ఇతర రాష్ట్రాల్లో కూడా సమీక్షించి అక్కడ పరిస్థితిని చూసి జీతాలు పెంచే ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. ఎక్కువ గంటలు పనిచేస్తే.. ఓవర్ టైమ్ ఇవ్వాలనే అంశాన్ని కూడా పరిశీలిస్తామని రంగనాథ్ వెల్లడిరచారు.స

# కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదికే ముఖ్యం

* మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
* స్పీకర్ పరిధిలో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం
* మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

**కరీంనగర్,ఆగస్టు11 :**

మేడిగడ్డ ప్రాజెక్ట్ లాంటి సంఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగా ముందుకెళ్తామని తెలిపారు. మేడిగడ్డ లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై సిట్ దర్యాప్తు చేస్తోందన్నారు. ఈ కేసులో ఎవరెవరిని విచారణకి పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం లేదని స్పష్టత ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్‌పై అధికారులే విచారణ చేస్తున్నారని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్‌తో లోపాయికారిగా ఒప్పందం చేసుకుందని విమర్శించారు. తమ మేనిఫెస్టోలోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జ్యూడీషనల్ ఎంక్వైరీ వేస్తామని చెప్పామని.. అన్నట్లుగానే వేశామని గుర్తుచేశారు. సోమవారంమంత్రి శ్రీధర్ బాబు కరీంనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగ వ్యవస్థలపై తమకు నమ్మకం ఉందని ఉద్ఘాటించారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి వద్ద పెండిరగ్‌లో ఉందని చెప్పుకొచ్చారు. జంతర్ మంతర్ వద్ద తమ నిరసన ధర్నాకు బీజేపీ ఎంపీలు ఎందుకు మద్దతు పలకలేదని ప్రశ్నించారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడితే జనం నమ్ముతారా అని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఎవరినీ పిలవాలన్నది సిట్ అధికారులే నిర్ణయిస్తారని వెల్లడిరచారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నిర్ణయం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై తుది నిర్ణయం స్పీకర్‌దేనని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల అంశం రాష్ట్రపతి, కేంద్రం వద్ద పెండిరగ్‌లో ఉందని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు బీసీ బిల్లులను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్షకు బీజేపీ ఎందుకు మద్దతు తెలపలేదు..? ఆ పార్టీ ఎంపీలు ఎందుకు హాజరు కాలేదని ప్రశ్నించారు. అలాంటిది ఈరోజు బీసీల గురించి ప్రతిపక్షాలు మాట్లాడితే నమ్ముతారా అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతోనే ముందుకు పోతామని స్పష్టం చేశారు.

# కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు లోక్‌సభ ఆమోదం

* ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటు

**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :**




కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. సెలక్షన్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు కొత్త బిల్లును ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశపెట్టారు. బిహార్ ఓటర్ల సమగ్ర సవరణపై విపక్షాలు ఆందోళన నిర్వహిస్తుండటంతో సభలో బిల్లుపై చర్చకు తావులేకుండా పోయింది. బిల్లు ప్రవేశపెట్టిన కొన్ని గంటల్లోనే ఎలాంటి చర్చా జరగకుండానే మూజువాణి ఓటుతో సభామోదం పొందింది. బిల్లు పాసైన అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడిరది. ఈ బిల్లును రాజ్యసభ ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ముందుకు వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో కొత్త చట్టంగా మారి 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం1961 స్థానంలో లోక్‌సభలో కేంద్రం ఆదాయపు పన్ను బిల్లు, 2025ను ప్రవేశపెట్టింది. దానిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించింది. బీజేపీ ఎంపీ బైజయంత్ పాండా నేతృత్వంలోని పార్లమెంటు సెలక్ట్ కమిటీ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్న అనంతరం కొత్త ఆదాయపు పన్ను బిల్లు2025ను ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సెలక్ట్ కమిటీ సిఫార్సులన్నింటినీ దాదాపుగా ఆమోదించినట్లు మంత్రి వెల్లడిరచారు. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి 66 బడ్జెట్లలో ఎన్నో సవరణలు జరిగాయి. సంక్లిష్టంగా తయారైన ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్లో ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో కొత్త బిల్లును రూపొందించారు. సవరించిన కొత్త బిల్లు దశాబ్దాల నాటి పన్ను నిర్మాణాన్ని మరింత సులభతరం చేస్తుందని, వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు, అనవసరమైన వ్యాజ్యాలను నివారించడానికి సహాయపడుతుందని బైజయంత్ పాండా అన్నారు.

# ఆర్మీ జడ్జి అడ్వకేట్ నియామకాల్లో లింగవివక్ష

* కేవలం పురుషులకే అన్న నిబంధనపై ఆగ్రహం
* తీవ్రంగా పరిగణించిన సుప్రీం కోర్టు
* వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి
* ఇంకెంతమాత్రం జాప్యం చేయడం సరికాదు
* తరలింపు ప్రక్రియను అడ్డుకుంటే కఠిన చర్యలు
* ఢిల్లీ అధికారులకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :**



భారత సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ బ్రాంచి పోస్టుల్లో నియామకాల కోసం అనుసరిస్తున్న 2:1 రిజర్వేషన్ నిష్పత్తి విధానం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. కేవలం పురుషులకే వీటిని రిజర్వ్ చేయడాన్ని సుప్రీం తప్పు పట్టింది. ప్రస్తుత విధానాన్ని అమలు చేయకూడదని తేల్చి చెప్పింది. మహిళలపై పరిమితి పెట్టి ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సైన్యంలోని జడ్జి అడ్వొకేట్ జనరల్ లీగల్ పోస్టుల కోసం జరిగిన పరీక్షల్లో అష్నూర్ కౌర్, ఆస్థ త్యాగి అనే మహిళా అధికారులు వరుసగా 4, 5వ ర్యాంకులు సాధించారు. అయినప్పటికీ వీరిని విధుల్లోకి తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పురుష అభ్యర్థులకన్నా తమకు మెరిట్ ఎక్కువగా ఉన్నప్పటికీ.. మహిళల కోటాల్లో ఖాళీలు లేవంటూ తమను ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి పిటిషన్‌పై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం అప్పుడు తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఈ అంశంపై తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం.. ఆర్మీ ఉన్నతాధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. ఈ విభాగంలో పురుషులకు 6.. మహిళలకు 3 పోస్టులు కేటాయించాలని నిష్పత్తి పెట్టడం ఏకపక్ష నిర్ణయం. లింగ తటస్థతకు నిజమైన అర్థం.. స్త్రీ, పురుష భేదం లేకుండా అత్యంత ప్రతిభావంతులైన అభ్యర్థులను ఎంపిక చేయడమే. అంతేగానీ, ఇలా మహిళలకు సీట్లను పరిమితం చేయడం సమానత్వ హక్కును ఉల్లంఘించడమే అవుతుంది. మహిళలపై పరిమితి పెట్టి.. ఖాళీ పోస్టులను పురుషులకు రిజర్వ్ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వెల్లడిరచింది. ఇలాంటి విధానాలను అనుసరిస్తే ఏ దేశం భద్రంగా ఉండబోదని ధర్మాసనం అభిప్రాయపడిరది. ఇకపై సమానత్వ పద్ధతిలోనే నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా స్త్రీ, పురుష అభ్యర్థుల మెరిట్ జాబితాను బహిర్గతం చేయాలని సూచించింది.

**వీధికుక్కలను వెంటనే షెల్టర్లకు తరలించండి**

ఢిల్లీ, ఎన్సీఆర్‌లలోని అన్ని వీధి కుక్కల బెడదపై సుప్రీం తీవ్రంగా స్పందించిది. వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. అలాగే జంతు ప్రేమికులు ఈ విషయంలో అడ్డుకుంటే సహించేది లేదని తెలిపింది. ఈ ప్రక్రియకు ఆటంకం కలిగించే ఏ వ్యక్తి లేదా సంస్థ అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం తీవ్రంగా హెచ్చరించింది. 6 వారాల్లోపు వీధి కుక్కలన్నింటినీ పట్టుకోవాలని తెలిపింది. అన్ని కుక్కలను క్రిమిరహితం చేసి శాశ్వతంగా ఆశ్రయాలకు తరలించాలని ఉత్తర్వులో న్యాయస్థానం పేర్కొంది. ఈ విషయంలో ఏ మాత్రం రాజీ లేకుండా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.వీటిని వెంటనే షెల్టర్లకు తరలించాలని అధికారులకు సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. ఈ ఆదేశాలు జారీ చేసింది. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని చెప్పింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయంపై విచారణ కొనసాగిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా ఢిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది. వీధికుక్కల తరలింపు ప్రదేశాలపై జస్టిస్ పార్దివాలా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభిప్రాయాన్ని కోరగా.. ఇందుకోసం ఇప్పటికే ఓ ప్రదేశాన్ని గుర్తించారని తెలిపారు. జంతు హక్కుల కార్యకర్తలు స్టే ఆర్డర్ పొందడంతో ఆ పనులు నిలిచిపోయాయని న్యాయస్థానానికి వివరించారు. దీంతో ఆగ్రహించిన జస్టిస్ పార్దివాలా 'ఆ జంతు ప్రేమికులందరూ కలిసి రేబిస్‌తో ప్రాణాలు కోల్పోయిన వారిని తిరిగి తీసుకురాగలుతారా?' అని ప్రశ్నించారు. వీధి కుక్కలను దత్తత తీసుకోవడానికి కూడా ఎవరికీ అనుమతి ఇవ్వొద్దని అన్నారు. కుక్కల కోసం వెంటనే షెల్టర్లను నిర్మించాలని అధికారులను ఆదేశించారు.



# మంత్రి పదవి అడ్డుకున్న ముఖ్య నేతలు: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**

తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని, ఆ విషయం వాస్తవమేనని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే ఆ హామీని అధిష్ఠానం అమలు చేయలేదని ఆయన వాపోయారు. ఈ విషయంలో రాష్ట్రంలోని ముఖ్య నేతలే అడ్డుకుంటూ, తనను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భట్టి విక్రమార్క వాస్తవాన్ని ప్రజలకు వివరించారని, ఇందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మంత్రి పదవి తనకు ముఖ్యం కాదని, ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందించాలనే ఆకాంక్ష మాత్రమే ఉందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. తెలంగాణ సమాజం ఆకాంక్షలు నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# సివిల్స్ అభ్యర్థులకు అన్నిరకాలుగా సాయం చేస్తాం: భట్టి విక్రమార్క

* మెయిన్స్ కు ఎంపికైన వారికి లక్ష చొప్పున చెక్కులు అందజేత

**హైదరాబాద్,ఆగస్ట్11 :**



సివిల్‌స్‌కు సన్నద్ధమయ్యే వారికి ఎంతో కొంత సాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకం కింద సివిల్స్2025లో మెయిన్‌స్‌కు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష చెక్కులను మంత్రి కోమటిరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్2024 విజేతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా అభ్యర్థులకు సాయం అందిస్తామన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా రెండో సంవత్సరం అమలుచేస్తున్నామన్నారు. సివిల్స్ అభ్యర్థులు పరీక్షలకు సిద్ధమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా సాయం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదని, సమాజానికి అందించే ఓ బాధ్యత అనిభట్టి విక్రమార్క అన్నారు. మానవ వనరులు అత్యంత బలమైన పెట్టుబడి అని, మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. గతేడాది అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారని, 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలన్నారు. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుందని పేర్కొన్నారు. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సివిల్స్2024 విజేతలకు సన్మాన కార్యక్రమం జరిగింది. మానవ వనరులకు మంచి తర్ఫీదు ఇస్తే రాష్ట్రానికి ఉపయోగపడతారని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన. సివిల్‌స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకు ఎంతో కొంత సాయం అందించాలని మేం ప్రయత్నం చేస్తున్నాం. మొత్తం సాయం కాకపోయినా.. కొంత మీకు అండగా ఉండాలని అభయ హస్తం ఇస్తున్నాం. మెయిన్‌స్‌కు వెళ్తున్న వారికి లక్ష సాయం చేస్తున్నాం, కొంత కొచించ్‌కి ఉపయోగ పడుతుందని ప్రభుత్వ ఆలోచన. లాస్ట్ ఇయర్ అభయ హస్తం పొందిన వారిలో 10 మంది సెలెక్ట్ అయ్యారు. 178 మందిలో గత ఏడాది కంటే ఎక్కువ మంది సెలెక్ట్ అవ్వాలి. సివిల్ సర్వెంట్‌ల సమావేశాల్లో కొందరు ఐఏఎస్‌లను రోల్ మోడల్‌గా చెప్తారు. మాధవరావు, ఎస్ఆర్ శంకరన్ లాంటి వాళ్లను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటాం. సమాజానికి నిబద్ధతతో చేసిన సేవ ప్రజల్లో నిలిచిపోతుంది. ఐఏఎస్ అంటే ఉద్యోగం కాదు.. సమాజానికి అందించే బాధ్యత. నిస్సహాయకులకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి. అప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు సక్సెస్ అవుతాయి. మాకు ఎంత చేయాలి అని ఉన్నా.. ఐఏఎస్‌లలో నిబద్ధత లేకుంటే లక్ష్యం చేరుకోలేం. శంకరన్ లాంటి వాళ్లు సంక్షేమ శాఖల్లో పని చేశారు. మిషన్ లాగ పని చేస్తే.. ప్రజలు కూడా మిషన్ లాగే మర్చిపోతారు. సవాళ్లను అధిగమించి లక్ష్యం సాధించండని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి.. ఇవాళ సివిల్‌స్‌కి వెళ్లే వారి వరకు అందరికీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నాం. 55 యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మాణ కి ఇప్పటికే టెండర్లు పిలిచాము. రైతు కొడుకు రైతే అవుతున్నాడు. మేము ఐదేళ్లు.. పదేళ్లు పదవుల్లో ఉంటాం. సివిల్స్ సాధించి మీరు ప్రజల సేవలో ఉండండి. కాన్ఫిడెన్స్‌తో సివిల్స్ ప్రిపేర్ అవ్వాలి. డిల్లీలో నా క్వార్టర్‌స్‌ను చదువుకునే వారికే ఇచ్చా. నా క్వార్టర్‌స్‌లో ఉండి చదువుకున్న ఇద్దరు ఇప్పుడు నా జిల్లాలోనే సర్వీసులో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు.

# వచ్చే మూడురోజులు భారీ వర్షాలు

* హెచ్చరిక జారీ చేసిన భారత వాతావరణ శాఖ

**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :**



దేశవ్యాప్తంగా వాతావరణం మళ్లీ ఒక్కసారిగా మారిపోతోంది. ఈ క్రమంలోనే భారత వాతావరణ శాఖ దేశంలోని పలు రాష్ట్రాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఢల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, రఙ్ఖండ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణలో వచ్చే మూడు నుంచి ఏడు రోజుల వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కాబట్టి ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసర యాత్రలు చేయొద్దని ఐఎండీ అధికారులు సూచిస్తున్నారు. ఢిల్లీప్రాంతంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని ఐఎండి చెబుతోంది. ఇక్కడ ఎల్లో అలర్ట్ జారీ అయింది. గరిష్ట ఉష్ణోగ్రత 3436శాతం. ఈ మధ్య, కనిష్ట ఉష్ణోగ్రత 26 28శాతం ఈ మధ్య ఉంటుందట. ఆగస్టు 13, 14 తేదీల్లో వర్షం కారణంగా చల్లగా అనిపిస్తుంది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, లక్నో, గోరఖ్‌పూర్, వారణాసి, మీరట్ వంటి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తూర్పు ఉత్తరప్రదేశ్‌కు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఇక్కడ రోజువారి ఉష్ణోగ్రత 3235శాతం. రాత్రి 2427శాతం మధ్య ఉంటుంది. బీహార్‌లోని దక్షిణ జిల్లాలు గయా, పట్నా, నవాడా, భాగల్పూర్‌లలో ఆగస్టు 12 నుంచి 14 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక జారీ అయింది. నవాడాలో గంగా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటుతోంది. ఉత్తర బీహార్‌లో మోస్తరు వర్షాలతో పాటు 4050 కి.మీ వేగంతో గాలులు, పిడుగులు పడే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. కాబట్టి, ఈ ప్రాంతాల్లో ఉన్న వాళ్లు జాగ్రత్తగా ఉండాలి. ఉత్తరాఖండ్‌లో ఆగస్టు 12న రెడ్ అలర్ట్ జారీ అయింది. ఉత్తర కాశీ, రుద్ర ప్రయాగ్, చమోలీ, బాగేశ్వర్, పిథోరాగఢ్, ఉధమ్ సింగ్ నగర్ జిల్లాల్లో 13 సెం.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందట. ఆగస్టు 13, 14 తేదీలకు ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుంది. డెహ్రాడూన్, బాగేశ్వర్‌లలో భారీ వర్షాల కారణంగా పాఠశాలలు మూసివేశారు. కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉన్నందున, ఈ ప్రాంతంలో ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్, సోలన్, షిమ్లా, సిర్మౌర్, మండీ, చంబా, కాంగ్రా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. ఆగస్టు 12న భారీ వర్షాలు, ఆ తర్వాత 13, 14 తేదీల్లో మోస్తరు వర్షాలతో పాటు 3040 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా. మన తెలంగాణలో కూడా ఆగస్టు 17 వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఒఃఉ హెచ్చరించింది. ఆగస్టు 13 నుంచి 17 వరకు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కాబట్టి, లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.



# ఎంపీలకు 184 నూతన ఫ్లాట్‌లు..

* కొత్త నివాస సముదాయాన్ని ప్రారంభించిన ప్రధాని

**న్యూఢిల్లీ,ఆగస్ట్11 :**

ఢిల్లీలో నూతనంగా నిర్మించిన ఎంపీల నివాస సముదాయాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో కలిసి మోడీ ఎంపీల ఫ్లాట్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఇకపై ఎంపీల కొత్త నివాసాల్లో ఎటువంటి సమస్యలు ఎదుర్కోరని.. పనిపై ఎక్కువ దృష్టి పెడతారని చెప్పారు. అద్దె భవనాల నుంచి పని చేసే మంత్రిత్వ శాఖల అద్దె ఏటా రూ.1,500 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. అలాగే ఎంపీలకు కూడా సరైన నివాసాలు లేకపోవడంతో ప్రభుత్వ ఖర్చులు కూడా చాలా ఎక్కువగా అవుతున్నాయని వెల్లడిరచారు. నివాసాల కొరత ఉండడంతో 2014 నుంచి 2024 వరకు దాదాపు 350 మంది ఎంపీలకు కొత్త నివాసాలు నిర్మించినట్లు తెలిపారు. తాజాగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనంలో 184 మందికి పైగా ఎంపీలు కలిసి నివాసం ఉండొచ్చని చెప్పారు. ఢల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో కొత్త నివాస సముదాయాన్ని నిర్మించారు. టైప్□పఒఒలో భాగంగా 184 ఫ్లాట్లతో బహుళ అంతస్తులతో ఈ నిర్మాణం చేపట్టారు. సోమవారం ఈ నివాసాన్ని ప్రారంభించే ముందు ప్రాంగణంలో సింధూర మొక్కను మోడీ నాటారు. అనంతరం కార్మికులతో సంభాషించారు. ప్రతీ ఫ్లాట్ చాలా విశాలంగా నిర్మించినట్లు తెలుస్తోంది.ఈ భవనం అల్యూమినియం షట్టరింగ్‌తో కూడిన మోనోలిథిక్ కాంక్రీటును ఉపయోగించి నిర్మించారు.

## ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడుచుకోవాలి



**శెనార్తి మీడియా, తలమడుగు**

ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి మార్గంలో నడుచుకోవాలని టిఎస్ డీడీసి మాజీ చైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు.. మండలంలోని కజ్జర్ల గ్రామంలో నెలరోజుల పాటు జరుగుతున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.. గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు అందరు ఐక్యమత్యంగా ఉండి నెల రోజులపాటు అఖండ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు... లోక భూమారెడ్డి నిర్వాహకులు శాలువాతో సత్కరించారు.. వారి వెంట గ్రామ పెద్దలు దేవా రెడ్డి, ప్రమోద్ రెడ్డి, కేశవరెడ్డి తదితరులు ఉన్నారు

## గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్ :** గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గొర్రెలకు సీజనల్ వ్యాధులు, కాలుకుంటుడు, నీలి నాలుకు వంటి వ్యాధుల నివారణకు టీకాలు, మందులు అందించడంతో పాటు పశుసంవర్ధక శాఖ ద్వారా కాపరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కొత్తగా ఏర్పడిన కరీంనగర్ జిల్లాలోని 243 గ్రామ సహకార సంఘాలలో 131 మాత్రమే ఎన్నికలు జరిగాయని, మిగతా గ్రామాల్లో కూడా ఎన్నికలు త్వరితగతిన జరగాలని, దీనికి ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య కురుమ, జిల్లా ఉపాధ్యక్షులు కర్ర శ్రీనివాస్ కురుమ, జిల్లా కార్యదర్శి జంగా కొమురయ్య యాదవ్, మండల అధ్యక్షులు చిగుర్ల కొమురయ్య కురుమ, ఒరుగుల తిరుపతి కురుమ, రాజు యాదవ్, గ్రామ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## నవాబుపేట విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



**శెనార్తి మీడియా, కరీంనగర్:** కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు మోదీ కానుకగా సైకిళ్లు అందజేస్తు న్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ తెలిపారు. సోమవారం నవాబుపేట ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు సైకిళ్లు అందజే శారు. కార్యక్రమంలో గ్రామ శక్తి కేంద్ర ఇన్‌చార్జి బుర్ర శ్రీనివాస్, మండల దళిత మోర్చ అధ్యక్షుడు అయిల పాక సాగర్, బీజేవైఎం నాయకులు, స్థానిక బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## వినాయక మండపం వద్ద ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఎమ్మెల్యే వినతి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని కన్నాపూర్ పరిధి కిష్కిందపల్లెలో వినాయక మండపం వద్ద ప్రహరీ , పెద్ద గేటు ఏర్పాటు చేసిన ప్రాంతం వద్ద ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణకు గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, కన్నాపూర్ పరిధి కిష్కిందపల్లెలో 20 ఏళ్లుగా వినాయక మండపం వద్ద పూజలు, బతుకమ్మ పండుగ వేడుకలు నిర్వహిస్తున్నారు. అయితే ఐలయ్య అనే వ్యక్తికి 25 సంవత్సరాల క్రితం నుంచి ఉత్తర దిశలో దారి ఉంది. తాజాగా పడమర వైపున ప్రహరీ వద్దకు వచ్చి ఇబ్బందులు కలిగించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలిపారు. సోమవారం జాతీయ జెండా గద్దె ఏర్పాటు చేయడానికి వెళ్లిన గ్రామస్తును ఐలయ్య అడ్డుకున్నాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై గ్రామస్తుల వినతిని స్వీకరించిన ఎమ్మెల్యే సత్యనారాయణ, విషయాన్ని కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు పంపినట్లు సమాచారం.

# కన్నాపూర్ గోదాముకు భారీగా రైతులు

- పది రోజుల తర్వాత 340 బస్తాలు రాక
- పెద్ద సంఖ్యలో చేరుకున్న అన్నదాతలు
- కొరత లేదంటున్న వ్యవసాయశాఖ అధికారులు



**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

మెట్ పల్లి పీఏసీఎస్ పరిధిలో రైతులు ఎరువుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల తర్వాత 340 ఎరువుల బస్తాలు కన్నాపూర్ గోదాముకు చేరడంతో సోమవారం కన్నాపూర్, ధర్మారం, ముత్తారం, అర్కండ్ల గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఒక్కసారిగా రైతులు అధిక సంఖ్యలో రావడంతో గోదాం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఎరువుల కోసం రైతులు ఉదయం నుంచి క్యూలో నిలబడి ఎరువుల బస్తా కోసం నిరీక్షించారు. పది రోజుల క్రితం రైతులు తమ చెప్పులు క్యూలో పెట్టి ఎరువుల బస్తాల కోసం క్యూలో నిల్చున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా 'శెనార్తి మీడియా'తో పలువురు రైతులు మాట్లాడుతూ, పంటలకు అత్యవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల పంటల పెరుగుదల దెబ్బతింటోందని, సమయానికి ఎరువులు అందకపోతే దిగుబడులు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల సరఫరా తక్కువగా ఉండటంతో అందరికీ సరిపడా అందడం లేదని వాపోతున్నారు. వెంటనే పంటల కు సరిపడా ఎరువుల బస్తాలను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. పంటల సీజన్‌లో ఎరువుల కొరత రాకుండా ముందుగానే సరఫరా చర్యలు తీసుకోవాలని కోరారు.

### మండలంలో సరిపడా ఎరువుల నిల్వలు : ఏవో

మండలంలో సాగవుతున్న పంటలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసయాధికారులు చెబుతున్నారు. మండల విస్తీర్ణం 25,208 ఎకరాలు కాగా, వర్షాకాలంలో 22,450 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో పత్తి 275 ఎకరాలు, మొక్కజొన్న 3 ఎకరాలు, ఇతర పంటలు 55 ఎకరాల్లో సాగుచేశారు. రైతులకు ఇప్పటివరకు 485 మెట్రిక్ టన్నుల డీఏపీ పంపిణీ జరిగింది. అవసరం 750 టన్నులు కాగా, మిగిలిన ఎరువులు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సీజన్ మొత్తానికి కావాల్సిన యూరియా 4,500 మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటివరకు 2,650 మెట్రిక్ టన్నులు పంపిణీ చేశారు. ఇంకా 1,850 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. ప్రస్తుతానికి 85 మెట్రిక్ టన్నులు స్టాక్‌లో ఉన్నాయి. కొంతమంది రైతులు యూరియాను నిల్వ ఉంచుకున్నారు. ప్రస్తుత పంటలతో పాటు వచ్చే సీజన్ కోసం కూడా అవసరమైన యూరియాను కొనుగోలు చేసి, దశలవారీగా అన్ని



సొసైటీలకు సరిపడేలా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అధికారులు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో వెంకటేష్ స్పష్టం చేశారు.

# లైసెన్స్ లేకుండా రైస్ మిల్స్, సీడ్ ప్లాంట్ల నిర్వహణ

- పోలీసులకు ఫిర్యాదు చేసిన మార్కెట్ కమిటీ కార్యదర్శి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండల పరిధిలో లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రైస్ మిల్స్, సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లపై అధికారులు నిశిత దృష్టి సారించారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్, నిల్వ, విక్రయానికి సంబంధిత చట్టాల ప్రకారం మార్కెట్ కమిటీ లేదా వ్యవసాయ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరి. అయితే కొంతమంది యజమానులు ఈ నిబంధనలను పక్కనపెట్టి ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, హుజూరాబాద్ మార్కెట్ కమిటీ కార్యదర్శి అశోక్, లైసెన్స్ తీసుకోకుండా పనిచేస్తున్న మిల్లులు, ప్లాంట్ల వివరాలను సేకరించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు లిస్టు అందజేశారు. ఆ లిస్టులో రైస్ మిల్స్, సీడ్ ప్లాంట్ల యాజమాన్యాల పేర్లు, వారి లొకేషన్‌లు, పని విధానం వంటి వివరాలు ఉన్నట్లు సమాచారం. వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచడం, రైతులకు న్యాయం జరగడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ లేని యూనిట్ల వలన పన్ను ఎగవేత, నాణ్యతలేని ఉత్పత్తుల విక్రయం, మార్కెట్ ధరల్లో గందరగోళం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఈ జాబితా ఆధారంగా సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా యూనిట్లను సీజ్ చేసే అవకాశమూ ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ చర్యలతో అక్రమ మిల్లులు, ప్లాంట్లు చట్టబద్ధ మార్గంలోకి వచ్చి రైతులకు, వినియోగదారులకు నష్టమూ తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

## పోడు భూములకు హక్కులు కల్పించాలి

### బీజేపీ మండల అధ్యక్షుడు సుగూర్తి జగదీశ్వరాచారి

**శెనార్తి మీడియా, కరీంనగర్:** తాతముత్తాతల కాలం నుండి సాగు చేస్తున్న పోడు భూములకు యాజమాన్య హక్కులు ఇవ్వాలని తిమ్మాపూర్ మండల బీజేపీ అధ్యక్షులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొమరం భీమ్ జిల్లా దిందా గ్రామస్తులు "చలో హైదరాబాద్" పేరిట 6వ తేదీ నుంచి పాదయాత్ర చేస్తున్నారు. ఆదివారం రాత్రి వారు రామకృష్ణ కాలనీకి చేరుకోగా, 45 మందికి బస, భోజన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అటవీ అధికారుల వేధింపుల వల్ల బీసీ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు కన్నీటి పర్యంతమై వివరించారు. నలభై ఏళ్లుగా వ్యవసాయం పైనే జీవనం సాగిస్తున్న తమకు క్రూర మృగాలకు ఇచ్చే ప్రాధాన్యత కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం




చేశారు. పాదయాత్రికులకు సంఘీభావం తెలుపుతూ స్థానిక బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. పాదయాత్రపై ప్రభుత్వం వెంటనే స్పందించి భూములకు హక్కులు కల్పించాలని, పాదయాత్రికులకు మానవతా దృక్పథంతో సాయం అందించాలని వారు కోరారు. సిర్‌పూర్ ఎమ్మెల్యే పాల్వాయ్ హరీష్ సహాయక చర్యలకు ధన్యవాదాలు తెలిపినట్లు పాదయాత్రికులు తెలిపారు.

## ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో సాప్ ప్రోగ్రాం ప్రారంభం



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

బొమ్మకల్ లోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎడ్యూనెట్ ఫౌండేషన్ ఆధ్వర్యం లో సాప్ ప్రోగ్రాం ప్రారంభమైంది. ఎడ్యూనెట్ ప్రాజెక్ట్ మేనేజర్ అఫ్సర్ పాషా, ప్రోగ్రామ్ మేనేజర్ దేవీ సేన్ చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాప్ స్పాన్సర్ షిప్ తో ఎంబీఏ విద్యార్థులకు ఉచితంగా ఈ కోర్స్ అందిం చి, గ్లోబల్ సర్టిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకా శాన్ని వినియోగించుకొని నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉద్యోగావకాశాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేంద్ర సింగ్, ఏవో డి.రాజశేఖర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి.కిషోర్, ఎంబీఏ హెచ్ ఓడీ, టీ పీవో డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సంతోషి, డి.రజిత రెడ్డి, ఎం.డి. ఇలియాస్ అలీ, ఎం.డి. అజారుద్దీన్, పి.సుప్రియా పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**శెనార్తి మీడియా, శంకరపట్నం :** ఎటువంటి అనుమతులు లేకుండా వీణవంక మండలం కోర్కల్ గ్రామం నుంచి హుజూరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. శంకరపట్నం మండలం ఆముదలపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ వద్ద ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేయగా, అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కోర్కల్ కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎరవేణి శ్రీనివాస్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదే చేసినట్లు ఎస్ఐ కే శేఖర్ రెడ్డి తెలిపారు

## కాంగ్రెస్ ఎన్నికల హామీలు నెరవేర్చాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం :** గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ విమర్శించారు. మండల సమస్యల పరి ష్కారానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.శంకరపట్నం బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ర్యాలీలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, జిల్లా ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి మాట్లాడుతూ – అంబేద్కర్ విగ్రహం–కరీంపేట రహదారి వెడల్పు, పలు గ్రామాల బిటి రహదారి మరమ్మత్తులు, వాగుపై హై లెవెల్ బ్రిడ్జి, అసంపూర్తి కళ్యాణమండపం పూర్తి, పారిశుద్ధ్య చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు.సమస్యలు పరిష్కరించకపోతే మండలవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో రాష్ట్ర, జిల్లా, మండల బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు

## ప్రజల కోసమే సంక్షేమ పథకాలు..

- ఎమ్మెల్యే పాయల్ శంకర్..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ప్రభుత్వం ఏదైనా ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ పథకాలను అందించడం జరుగుతోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు.ఇందులో భాగంగానే షాదీ ముబారక్,కళ్యాణ లక్ష్మి పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.ఆదిలాబాద్ పట్టణంలోని జడ్పీ సమావేశ మందిరంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా 132 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. లబ్ధిదారులకు త్వరితగతిన చెక్కులు అందేలా అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య, ఆర్డీవో స్రవంతి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న మహారాష్ట్ర దేశీదారును పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు.ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరికి చెందిన అలిశెట్టి అవినాష్ అక్రమంగా దేశీ తరలిస్తుండగా జైనథ్ మండలంలోని కోరట శివారులో ఎక్సైజ్ అధికారులను చూసి పారిపోయాడు.రూ.24 వేల విలువ చేసే 530 బాటిళ్లను, బైక్ ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.నిందితుడిని త్వరలోనే పట్టుకుని జైలుకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.

## బాధితుడికి వీల్ చైర్ అందజేత..

- ఉదారత చాటిన కాంగ్రెస్ నేత అల్చెట్టి నాగన్న..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ రూరల్ మండలం శివఘాట్ గ్రామానికి చెందిన లాయిరి భగవాన్లు అనారోగ్యంతో ఇటీవలే తన కాలును కోల్పోయాడు.కాగా ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న బాధితుడి ఇంటికి వెళ్లి వీల్ చైర్ అందించి గొప్ప మనసు చాటుకున్నాడు.ఈ కార్యక్రమంలో నాయకులు అరిగెల కిష్టయ్య, పాలెపు భాస్కర్,అనుముల సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యూనివర్సిటీ సాధనే లక్ష్యంగా ముందుకు..

- సాధన సమితి కన్వీనర్ బద్దం పురుషోత్తం..



**శెనార్తి మీడియా, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ యూనివర్సిటీ సాధనే లక్ష్యంగా ముందుకు సాగుదామని సాధన సమితి కన్వీనర్ బద్దం పురుషోత్తం రెడ్డి అన్నారు సోమవారం డైట్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదిలాబాద్ యూనివర్సిటీ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో కో కన్వీనర్ తొగరి భాస్కర్,సభ్యులు ఎల్మ శ్రీకాంత్ రెడ్డి,అఫ్సర్ ఖాన్, ప్రఫుల్ వజె,సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

## టీఎన్జీవో భూములపై అక్రమాలు..?

- ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బీఎస్పీ నాయకులు



శెనార్తి మీడియా, మంచిర్యాల

మంచిర్యాల జిల్లా నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42లో గల టీఎన్జీవో ప్లాట్లలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుతున్నాయా అని ప్రశ్నించారు.గూడు కోసం గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే ప్రభుత్వ అధికారులు, జిల్లా కేంద్రానికి సమీపంలోని టీఎన్జీవో కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలేదని విమర్శించారు. నస్పూర్ శివారులోని సర్వే నెంబర్ 42లో టీఎన్జీవో ప్లాట్ల పేరిట రియల్ ఎస్టేట్ వెంచర్ జరుగుతోందనే అనుమానం వ్యక్తం చేశారు.వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కాదాసి రవీందర్, జిల్లా అధ్యక్షులు ముల్కల్ల రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు, నాయకులు జాడి ప్రేంసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో వనమహోత్సవం

- మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు



శెనార్తి మీడియా, మంచిర్యాల

వనమహోత్సవం లో భాగంగా జైపూర్ మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీవో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజులు, పెళ్లి రోజులు వంటి ప్రత్యేక దినాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ వాతావరణ సమతుల్యతకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీ సంతోష్, ఏపీఓ బి. బాలయ్య, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీమతి కవిత, పంచాయతీ కార్యదర్శి బి. ఉదయ్ కుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచన



శెనార్తి మీడియా, మంచిర్యాల

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో డీసీపీ ఎ. భాస్కర్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా అధికారులు పాల్గొన్న సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆగస్టు 15న నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన ఆవరణలో జరిగే వేడుకల్లో ప్రతి శాఖ తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఉత్తమ సేవలందించిన వారి జాబితాను 13వ తేదీలోగా సిద్ధం చేయాలని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, బ్యాండ్ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. కుర్చీల ఏర్పాటు రాజస్వ మండల అధికారి, నస్పూర్ తహసీల్దార్ సంయుక్తంగా చూసుకోవాలని, మున్సిపల్ కార్పొరేషన్ త్రాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహించాలని తెలిపారు.విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యవసాయ, అటవీ, పశుసంవర్ధక, ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ శాఖలు, బ్యాంకుల ఆధ్వర్యంలో సైబర్, ఆర్థిక అక్షరాస్యతపై స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల ప్రగతి నివేదికలను 12వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు.ప్రశంసాపత్రాల పంపిణీ, పతాకావిష్కరణ, వేదిక అలంకరణ, పుష్పగుచ్ఛాలు, టెంట్, సౌండ్ సిస్టమ్, ప్రముఖుల ఆహ్వానం, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక ఏర్పాట్లు వంటి అన్ని అంశాలను సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. వేడుకలకు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం కోసం నులిపురుగుల నిర్మూలనపై దృష్టి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

శెనార్తి మీడియా, మంచిర్యాల




నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యం మెరుగుపరచేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. హరీష్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, ఉప వైద్యాధికారి డా. అనితతో కలిసి కలెక్టర్ విద్యార్థులకు మాత్రలు తినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 1 లక్ష 58 వేల 480 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ మాత్రలు తినిపించడం జరుగుతుందని తెలిపారు. 930 అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలలో ఈ కార్యక్రమం అమలవుతుందని చెప్పారు.వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ, మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం కావాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత తగ్గి పిల్లల పోషణ, మానసిక–శారీరక అభివృద్ధి, చదువులో ఆసక్తి, హాజరు శాతం పెరుగుతుందని వివరించారు.1–3 సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర చూర్ణం చేసి నీటితో, 3–19 సంవత్సరాల వారికి ఒక మాత్ర చప్పరించి ఇవ్వాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, పాదరక్షలు ధరించడం, బహిరంగ మలవిసర్జన నివారణపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా. ఎ. ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు రాజయ్య, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి ఫిర్యాదులకు వేగవంతమైన పరిష్కారం

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్‌రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్, మందమర్రి, బెల్లంపల్లి, భీమారం, శ్రీరాంపూర్, చెన్నూర్, లక్షెట్టిపేట, హాజీపూర్ మండలాల నుండి పలువురు వ్యక్తులు మరియు సంఘ ప్రతినిధులు సమస్యల పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పించారు. ఇందులో ఇళ్లు కూలిపోవడం, భూమి పట్టా మంజూరు, భూమి లావాదేవీల నిలుపుదల, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, విగ్రహాల ఏర్పాటు, డ్రైనేజ్ సమస్యలు, ఆస్తి హక్కుల వివాదాలు, మురుగునీటి సమస్యలు, విద్యాసంస్థల ఏర్పాటు, ఉపాధి కల్పన, అక్రమ నిర్మాణాల నివారణ వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి.ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### యూరియా దుర్వినియోగం నివారించేందుకు జిల్లా కలెక్టర్ దిశానిర్దేశాలు

జిల్లాలో పంటలకు అవసరమైన యూరియా సమృద్ధిగా ఉన్నప్పటికీ, దానిని ప్రక్కదారి మళ్లించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు.సోమవారం నస్పూర్ సమీకృత జిల్లా కార్యాలయ భవన సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక మొత్తంలో యూరియా కొనుగోలు వంటి చర్యలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.జిల్లాలో పత్తి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడికి అనుగుణంగా రిజిస్టర్లు నిర్వహించాలని, ఈ నెల 31లోగా వరి సాగు ప్రారంభించని రైతులను ఇతర పంటల సాగు చేయటకు ప్రోత్సహించాలని చెప్పారు. పత్తిలో మునగ అంతర పంట సాగు కోసం ఉపాధి హామీ పథకం కింద గుంతలు తీయడం, మొక్కలు నాటడం, నీటి సరఫరా కోసం నిధులు అందిస్తున్నట్లు వివరించారు.జిల్లాలో మొక్కజొన్న సాగు 70 ఎకరాల నుంచి 300 ఎకరాలకు పెరిగిందని, అవసరమైతే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కందులు, పెసలు, మినుముల సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం నమోదు కంటే తక్కువగా ఉందని, దానిపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు.వరి కోతను నవంబర్ మొదటి వారం నుంచే ప్రారంభించేలా సాగు సమయాన్ని సర్దుబాటు చేయాలని, రైతు భీమా పథకంలో నమోదు కొనసాగుతుందని, లబ్ధిదారులు జాతీయ కుటుంబ సంక్షేమ పథకం పరిహారాన్ని పొందేందుకు సంబంధిత అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో మ్యాట్రిక్స్ సి.ఈ.ఓ. ఉదయ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో విస్తృత పోలీసు తనిఖీలు




శెనార్తి మీడియా, మంచిర్యాల

- మందమర్రి సీఐ నేతృత్వంలో ఆపరేషన్

కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామంలో సోమవారం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో గొల్లవాడ, రాంపూర్ ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అపరిచితులకు ఎవరైనా ఆశ్రయం ఇస్తున్నారా అనే కోణంలో గృహాల వారీగా ఆధార్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. ద్విచక్ర వాహనాల డ్రైవింగ్, ఇన్సూరెన్స్ పత్రాలు తనిఖీ చేసి, పత్రాలు లేని 45 వాహనాలకు జరిమానాలు విధించగా, నెంబర్ ప్లేట్లు లేని రెండు వాహనాలను సీజ్ చేశారు.సీఐ శశిధర్ రెడ్డి ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ఏర్పాటు ప్రయోజనాలు, ట్రాఫిక్ నియమాలు, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, గుడుంబా విక్రయాలపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో దేవాపూర్, కాసిపేట, రామకృష్ణాపూర్ ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

- జోనల్ ఆఫీసుకు వినతిపత్రం సమర్పణ

శెనార్తి మీడియా, మంచిర్యాల



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ (గర్ల్స్) గురుకుల ప్రిన్సిపాల్ నిర్లక్ష్య ధోరణిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా ప్రతినిధులు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జోనల్ ఆఫీసుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎల్దండి నిఖిల్ వివరించగా, ఆగస్టు 6న అర్ధరాత్రి 12 గంటలకు నలుగురు వ్యక్తులు గురుకుల ప్రాంగణంలోకి చొరబడ్డారని, వారిని అదుపులోకి తీసుకున్నప్పటికీ ఇది ఆ వారంలో మూడోసారి జరిగిన ఘటనగా తాము గుర్తించినట్లు తెలిపారు. మొదటి సారి జరిగినప్పుడు ప్రిన్సిపాల్ పోలీసులు లేదా సోషల్ వెల్ఫేర్ అధికారులకు సమాచారం ఇవ్వకపోవడం, ఆరవ తేదీ ఘటన తర్వాత కూడా పై అధికారుల దృష్టికి తీసుకురాకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.ఘటన తరువాత విద్యార్థులకు భరోసా కల్పించాల్సిన సమయంలో ప్రిన్సిపాల్ మరుసటి రోజు సెలవు తీసుకుని గైర్హాజరైనట్లు నిఖిల్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు జోనల్ ఆఫీసర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చే వరకు వారికి ఘటన గురించి తెలియలేదని పేర్కొన్నారు. ఇలాంటి బాధ్యతారాహిత్య వైఖరి ప్రదర్శించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హర్షవర్ధన్ సహా పలువురు ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## దాడి కేసులో నిరపరాధులను తొలగించాలి

- ఎమ్మెల్యేకు గుంట శ్రీశైలం వినతి



శెనార్తి మీడియా, మంచిర్యాల

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం అవడం గ్రామంలో జరిగిన ఇంటిపై దాడి కేసులో సంబంధం లేని వ్యక్తుల పేర్లను తొలగించాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు గుంట శ్రీశైలం డిమాండ్ చేశారు. తల్లి అక్రమ సంబంధం ఆరోపణలతో మానసిక వేదనకు గురై దుర్కి అనిల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన అనంతరం, కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు మరణానికి కారణమైన వ్యక్తి ఇంటి ముందు శవాన్ని ఉంచి దాడి చేసిన విషయం తెలిసిందే.ఈ ఘటనపై పోలీసులు పలువురిపై కేసు నమోదు చేయగా, దాడికి సంబంధంలేని 27 మందిపైనా అక్రమంగా కేసులు పెట్టారని శ్రీశైలం ఆరోపించారు. సోమవారం హైదరాబాదులో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామిని కలిసి ఈ విషయంపై వివరించారు. దీనిపై ఎమ్మెల్యే అనిల్ కుటుంబాన్ని పరామర్శించి, కేసు పూర్తి వివరాలు తెలుసుకుని, నిరపరాధుల పేర్లు తొలగించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## 13న నస్పూర్‌లో మినీ జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

శెనార్తి మీడియా, మంచిర్యాల

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల కోసం 13వ తేదీన మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ తెలిపారు.నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ శిక్షణ కేంద్రంలో ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని చెప్పారు. శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్–మంచిర్యాల సంస్థలో పని చేయుటకు మంచిర్యాల ప్రాంతంలో 20 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (పురుషులు/మహిళలు) పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ అర్హత ఉండాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9640731731, 77022 84181, 99081 87894 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రవికృష్ణ పేర్కొన్నారు.

## గణేష్ టెంపుల్‌కు విరాళం



శెనార్తి మీడియా, మంచిర్యాల

భీమారం మండలం పోలంపల్లి తాజా మాజీ సర్పంచ్ దర్శనాల రమేష్ పద్మశాలి గణేష్ టెంపుల్ నిర్మాణానికి 50,016 రూపాయలు విరాళంగా అందించారు. సోమవారం భీమారం మండలంలోని తన నివాసంలో పద్మశాలి కుల పెద్దలు, యువజన సభ్యులు సహాయం కోసం విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించి తక్షణమే విరాళం అందించారు.పద్మశాలి గణేష్ మండలి మరియు పద్మశాలి సంఘం భీమారం తరపున దర్శనాల రమేష్ గారికి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ కాలనీ సమస్యలపై వినతితక్షణ చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్




శెనార్తి మీడియా, మంచిర్యాల

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సర్వీస్ రోడ్ కిందకు ఉండడంతో పాటు నీరు వెళ్లే మార్గంలో ప్రైవేటు ఫామ్ హౌస్‌లు ఉండడం సమస్యగా మారిందని ఫిర్యాదు చేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

# వరల్డ్ కప్ 2025కు భారత్ ఆతిథ్యం




భారత మహిళల జట్టుకు తొలిసారిగా వన్డే ప్రపంచ కప్ గెలిచేందుకు సువర్ణావకాశం లభించింది. మహిళల వన్డే క్రికెట్ వరల్డ్ కప్ 2025కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. సొంత గడ్డపై జరగనున్న ఈ టోర్నమెంట్‌లో తొలిసారి ఐసీసీ టైటిల్ సాధించాలని భారత మహిళా క్రికెట్ జట్టు కలలు కంటోంది. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అభిమానులకు ఒక మెసేజ్ ఇచ్చారు. ఈసారి కప్ కచ్చితంగా కొడతామని దేశప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఆ కలను నిజం చేస్తామని ఆమె చెప్పారు. మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు భారత్, శ్రీలంక సంయుక్త ఆతిథ్యంలో జరగనుంది. ఈ టోర్నమెంట్‌కు సంబంధించి 50 రోజుల కౌంట్‌డౌన్ ప్రారంభోత్సవంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడారు. "సొంత ప్రేక్షకుల ముందు ఆడడం ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుంది. ఈసారి మా జట్టు కప్ గెలవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది. భారత అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఆ కలను నిజం చేస్తాం" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హర్మన్‌ప్రీత్ కౌర్, మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తన స్ఫూర్తి అని చెప్పారు. "వరల్డ్ కప్ టోర్నమెంట్‌లు ఎప్పుడూ ప్రత్యేకమే. అలాంటి సందర్భాల్లో మన దేశం పేరు నిలబెట్టడానికి నేను ప్రయత్నిస్తాను. నేను యువరాజ్ సింగ్‌ను చూసి ఇన్ స్పైర్ అయ్యాను" అని ఆమె అన్నారు. వరల్డ్ కప్‌కు ముందు భారత్, ఆస్ట్రేలియాతో మూడు వన్డే మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్‌ను హర్మన్‌ప్రీత్ కౌర్ వరల్డ్ కప్‌కు ఒక మంచి సన్నాహంగా అభివర్ణించారు. "ఆస్ట్రేలియాతో ఆడటం ఎప్పుడూ ఒక పెద్ద సవాలే. ఈ సిరీస్ మా సన్నాహాలు ఎంతవరకు ఉన్నాయో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది.

మేము చాలా గట్టిగా ప్రాక్టీస్ చేశాం, మా మంచి ప్రదర్శన దాని ఫలితమే" అని ఆమె పేర్కొన్నారు. ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్ రౌండ్-రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ఇందులో మొత్తం 8 జట్లు పాల్గొంటాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్ సెప్టెంబర్ 30న భారత్, శ్రీలంక మధ్య జరగనుంది.

## రిస్క్ తీసుకుని రజనీ సినిమా చూశాను

*ప్రముఖ క్రికెటర్ సంజు శాంసన్*




తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన కొత్త సినిమా 'కూలి' ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా టికెట్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. చెన్నైతో సహా పలు నగరాల్లో మొదటి రోజు టికెట్లు ఇప్పటికే అమ్ముడయ్యాయి. తమిళనాడులో తెల్లవారుజామున ప్రదర్శనలపై నిషేధం ఉన్నందున చాలా మంది అభిమానులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి సినిమా చూడాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ ఈ సినిమాను తెరకెక్కించడంతో అభిమానుల మధ్య భారీ అంచనాలు నెలకొన్నాయి. సూపర్ స్టార్ రజనీకాంత్‌కు అభిమానులు అన్ని వర్గాల నుంచి ఉన్నారు. చాలా మంది బాలీవుడ్ స్టార్లు కూడా రజనీకాంత్‌కు అభిమానులే. ప్రముఖ క్రికెటర్ సంజు శాంసన్ కూడా రజనీకాంత్‌కు వీరాభిమాని కావడం గమనార్హం. కేరళలో పుట్టి పెరిగిన సంజు శాంసన్ ఎల్లప్పుడూ రజనీ సినిమాలు, పాటలు చూడటానికి ఇష్టపడతాడు. రజనీకాంత్ డైలాగ్‌లను ఒక్కటి కూడా వదలకుండా కంఠస్థం చెప్పే అలవాటు కూడా సంజు శాంసన్‌కు ఉంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో సంజు శాంసన్ తన అభిమానం గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నాడు. క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ నిర్వహించిన ఓ ఇంటర్వ్యూలో రజనీకాంత్‌పై తన అభిమానం గురించి సంజు శాంసన్ మాట్లాడాడు. ఒకసారి ఐర్లాండ్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడుతున్నప్పుడు, మరుసటి రోజు తనకు ఒక ముఖ్యమైన మ్యాచ్ ఉన్నప్పటికీ, రజనీకాంత్ సినిమా విడుదలైనందున ఒంటరిగా సినిమా చూడటానికి వెళ్లినట్లు సంజు శాంసన్ తెలిపాడు. డబ్లిన్‌లో థియేటర్ ఎక్కడుందో వెతికి, టికెట్ కొనుక్కుని సినిమా చూసి వచ్చినట్లు చెప్పాడు. "నాకు రజనీ అంటే ఎంత ఇష్టమో దీనిని బట్టి అర్థం చేసుకోండి" అని సంజు శాంసన్ అన్నాడు. "నేను పెద్ద రజనీ అభిమానిని. ఆయన సినిమా విడుదలైన మొదటి రోజే చూసేస్తాను. ఒకసారి మేము ఐర్లాండ్లో క్రికెట్ ఆడటానికి వెళ్లాం. మరుసటి రోజు నాకు క్రికెట్ మ్యాచ్ ఉంది. కానీ ఆ రోజు రజనీ సినిమా విడుదలైంది. నేను సినిమా చూడాలనే ఉద్దేశంతో హెూటల్ నుండి బయలుదేరి ఒంటరిగా వెళ్ళిపోయాను. డబ్లిన్లో థియేటర్ ఎక్కడ ఉందో వెతికి, అక్కడ రజనీ సినిమా ఆడుతుందో లేదో తెలుసుకుని, టికెట్ తీసుకుని సినిమా చూసి వచ్చాను. అప్పుడు మీరు అర్థం చేసుకోండి, నాకు రజనీ అంటే ఎంత ఇష్టమో" అని సంజు శాంసన్ చెప్పాడు. కూలి సినిమాపై అభిమానుల మధ్య అంచనాలు పెరిగిన సమయంలో సంజు శాంసన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ ఫోకస్!

భారత్‌లోని అత్యంత ప్రతిభావంతులైన యువ బ్యాటర్లలో ఒకడైన వైభవ్ సూర్యవంశీ ప్రస్తుతం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లో ఆస్ట్రేలియా పర్యటన కోసం ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. ఈ 14 ఏళ్ల యువ సంచలనం ఇప్పటికే తన ప్రతిభతో క్రీడా ప్రపంచంలో ప్రకంపనలు సృష్టించాడు. ఇంగ్లండ్ నుంచి తిరిగి వచ్చిన వెంటనే రాజస్థాన్ రాయల్స్‌తో ప్రత్యేక ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నాడు. అక్కడి నుంచి నేరుగా నేషనల్ క్రికెట్ అకాడమీ కి వెళ్లిన వైభవ్ సూర్యవంశీ కోసం ఒక ప్రత్యేక శిక్షణ షెడ్యూల్‌ను రూపొందించారు. దీనిలో ముఖ్యంగా టెక్నికల్ డ్రిల్స్, మ్యాచ్ పరిస్థితులపై దృష్టి సారించే విధంగా శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ చిన్ననాటి కోచ్ మనీష్ ఓఝూ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం కేవలం ఆస్ట్రేలియా పర్యటన కోసం కాదని.. భవిష్యత్తు కోసమని చెప్పారు. భారత క్రికెట్ భవిష్యత్ కోసం బీసీసీఐ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణమయని తెలిపారు. "సీనియర్ ఆటగాళ్లు రిటైర్ అవుతున్నందున వారి స్థానాన్ని భర్తీ చేయడానికి యువ ఆటగాళ్లను సిద్ధం చేయాలి. ఈ శిక్షణ ఆ ప్రక్రియలో భాగమే. మేము ఒక్కొక్కరిని ఎంపిక చేసి, అంతర్జాతీయ క్రికెట్‌కు అవసరమైన అన్ని నైపుణ్యాలలో వారిని నిష్ణాతులను చేస్తాం." అని మనీష్ ఓఝూ వివరించారు."వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడే బ్యాటింగ్ శైలి టీ20, వన్డే క్రికెట్లలో మంచి విజయాన్ని తెచ్చిపెట్టింది. ఐపీఎల్, అండర్-19, విజయ్ హజారే టోర్నమెంట్లలో ఈ ప్రతిభను చూశాం. అయితే టెస్ట్ ఫార్మాట్‌లో వైభవ్ ప్రదర్శనలో స్థిరత్వం ఇంకా పెరగాలి" అని మనీష్ ఓఝూ అభిప్రాయపడ్డారు. "వైభవ్ బలహీనత ఏంటంటే, తెల్ల బంతి క్రికెట్‌తో పోలిస్తే టెస్ట్ ఫార్మాట్‌లో అతని ప్రదర్శన స్థాయి తగ్గుతుంది. మా లక్ష్యం ఆ స్థిరత్వాన్ని మెరుగుపరచడమే. అతను 10 ఇన్నింగ్స్‌లు ఆడితే, కనీసం 7-8 ఇన్నింగ్స్‌లు ప్రభావవంతంగా ఉండాలి" అని మనీష్ ఓఝూ అన్నారు. ఈ శిక్షణలో వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్‌తో పాటు అతని ఫిట్‌నెస్, ఫీల్డింగ్, ఇతర అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇంకా టీనేజ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీ ఒక కీలక దశలో ఉన్నాడు. సహజమైన టాలెంట్ ఇప్పటికే వైభవ్ సూర్యవంశీని నిలబెడుతోంది. కానీ పూర్తి స్థాయి అంతర్జాతీయ ఆటగాడికి ఎదగడానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాలి. బెంగళూరులోని ఈ శిక్షణ శిబిరం దాదాపు ఒక వారం పాటు కొనసాగుతుంది. ఆ తర్వాత వైభవ్ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేస్తాడు.





## ఐపీఎల్ 2026లో ఆడే విషయంపై ధోనీ కామెంట్స్

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లైనా సరే అతడి క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. ఇప్పటికీ అతడిని మైదానంలో చూడాలనేది అభిమానుల కోరిక. చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు టైటిల్స్? అందించిన ధోనీ ఇప్పుడు కేవలం ఐపీఎల్?లో రెండు నెలలు మాత్రమే ఆడుతున్నాడు. గత రెండేళ్ల నుంచి ఇదే చివరి సీజన్ అంటూ వార్తలు వచ్చినా వాటిని కాదని బరిలోకి దిగడం చూశాం. ఐపీఎల్ 2026 సీజన్?కు ఇంకా చాలా సమయం ఉంది. అయినా ధోనీ ఏ కార్యక్రమంలో పాల్గొన్న 'మీరు ఆడాలి' అని విజ్ఞప్తులు వస్తున్నాయి. తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్న ధోనీకి మళ్లీ క్రికెట్ ఆడాలని కోరారు. దానికి అతడు ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. "నేను ఆడతానో లేదో తెలీదు. దానికి ఇంకా సమయం ఉంది. సరైన నిర్ణయం తీసుకోవడానికి డిసెంబర్ చివరి వరకూ ఎదురుచూస్తా. కాబట్టి నిర్ణయం ఇప్పుడే చెప్పడం సరియైంది కాదు. తప్పకుండా మంచి నిర్ణయమే తీసుకుంటా" అని ధోనీ అన్నారు. తర్వాత వెంటనే ధోనీ అభిమాని ఒకరు లేచి మీరు తప్పకుండా ఆడాలి సర్! అనగానే దాని సమాధానంగా ధోనీ, 'నాకు మోకాలి నొప్పి ఉంది. దాన్ని ఎవరు బరిస్తారు' అని చెప్పారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంగణం అంతా నవ్వులతో విరిసింది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి- మే మధ్య జరగనుంది. గత సీజన్‌లో రుతురాజ్‌కు గాయం కావడం వల్ల ఎంఎస్ ధోనీ తాత్కాలికంగా సారథ్యం చేపట్టాడు. ఇప్పుడు 2026 సీజన్ కోసం నూతన నాయకత్వం వైపు సీఎస్‌కే చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అందుకోసం సంజు శాంసన్‌ను తీసుకోవాలనే పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై సంజు మాత్రం ఇంకా అధికారికంగా స్పందించలేదు. రాజస్థాన్ జట్టే తనకు ప్రపంచమని ఇటీవల సంజు శాంసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

## యశ్ దయాల్ పై నిషేధం విధింపు




ఆర్సీబీ స్టార్ బౌలర్ యశ్ దయాల్‌ను ఇప్పుడు కష్టాలు చుట్టుముట్టాయి. ఐపీఎల్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ట్రోఫీ అందించడంలో కీలక పాత్ర పోషించిన యశ్ దయాల్ తన ఆటతో అందరినీ ఆకట్టుకున్నాడు. కానీ ఇప్పుడు యశ్ దయాల్ కెరీర్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం కనిపిస్తోంది. యశ్ దయాల్‌పై లైంగిక దాడి ఆరోపణలు రావడంతో ఒక కీలక లీగ్ నుంచి అతడిని నిషేధించారు. యశ్ దయాల్ తనపై వచ్చిన లైంగిక ఆరోపణల కారణంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో అతడిని ఒక కీలక లీగ్ నుంచి నిషేధించారు. ఉత్తరప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అతడిని రాబోయే యూపీ టీ20 లీగ్ నుంచి నిషేధించింది. యశ్ దయాల్‌పై 17 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు రాగా.. యూపీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో అతని క్రికెట్ కెరీర్ కు ప్రమాదం ఏర్పడింది. ఈ నిర్ణయం వల్ల యూపీ టీ20 లీగ్‌లో గోరఖ్‌పూర్ లయన్స్ జట్టు యశ్ దయాల్‌ను రూ. 7 లక్షలకు కొనుగోలు చేసినప్పటికీ, ఈ సీజన్‌లో అతను ఆడలేడు. యశ్ దయాళ్‌పై జైపూర్‌లోని సాంగనేర్ సదర్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు నమోదైంది. ఈ కేసులో రాజస్థాన్ హైకోర్టు నుంచి అతనికి ఎలాంటి ఉపశమనం లభించలేదు. ఇది మైనర్‌కు సంబంధించిన కేసు కాబట్టి, అతని అరెస్టుపై స్టే ఇవ్వడానికి కోర్టు నిరాకరించింది. ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టు 22న జరగనుంది. కోర్టు నుండి ఉపశమనం లభించకపోవడంతో యశ్ అరెస్టుకు అవకాశాలు పెరిగాయి. వాస్తవానికి యశ్ దయాల్‌పై లైంగిక వేధింపులు రావడం ఇది రెండోసారి. గతంలో ఘజియాబాద్‌కు చెందిన ఒక మహిళను వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగికంగా వేధించాడని ఆరోపణలు వచ్చాయి. ఆ కేసులో అలహాబాద్ హైకోర్టు యశ్ దయాల్ అరెస్టుపై స్టే విధించింది. కానీ ఇప్పుడు జైపూర్‌లో నమోదైన కొత్త కేసు యశ్ దయాల్ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది. ఇదిలా ఉండగా.. యశ్ దయాల్ ఇటీవల ఐపీఎల్ 2025ల ఆర్సీబీ తరఫున మంచి ప్రదర్శన చేసి 15 మ్యాచ్‌లలో 13 వికెట్లు పడగొట్టి జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే యశ్ దయాల్‌పై వచ్చిన ఈ తీవ్రమైన ఆరోపణల కారణంగా అతని భవిష్యత్తు ప్రస్తుతం అనిశ్చితిలో ఉంది.

## 30 కాదు... 50 శాతం పెంచుదాం..

# ఆ బాధ్యత ఎవరిది?



టాలీవుడ్‌లో నెలకొన్న సినీ కార్మికుల వేతనాల సమస్యపై చిన్న సినిమాల నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. సినీ కార్మికుల వేతనాల పెంపు డిమాండ్ పట్ల తమ అభిప్రాయాలను వెల్లడించారు. నిర్మాతలకు సైతం పేమేంట్స్ సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో నిర్మాతలు ఎస్‌కేఎన్, రాజేశ్ దండా, మధుర శ్రీధర్, చైతన్య రెడ్డి, శరత్ చంద్ర, ధీరజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఎస్‌కేఎన్ మాట్లాడుతూ..' అందరూ రైట్స్ గురించి మాట్లాడుతున్నారు. మేము నిర్మాతల బాధ్యతల గురించి మాట్లాడతాం. నిర్మాతల సమస్యల గురించి చెప్పటం లేదు. నిర్మాతలకు ఎవరితో ఎప్పుడు ఎలా పని చేయాలనే ఆప్షన్ ఉండాలి. వేతనాలు యాభై శాతం పెంచుదాం.. కానీ మా సినిమాల పెట్టుబడికి తగిన బిజినెస్ ఎవరు చేస్తారు. థియేటర్లకు ప్రేక్షకులను ఎవరు రప్పిస్తారు? మా సినిమా బడ్జెట్లకు ఎవరు బాధ్యత తీసుకుంటారు? చిన్న సినిమాలకు సరైన బిజినెస్ అవటం లేదు.. అయినా రెండు వేల లోపు వేతనాలు తీసుకునే కార్మికులకు పెంచుతామన్నాం. టికెట్ రేట్ల పెంపు అనేది కేవలం పెద్ద సినిమాలకే.. అవీ ఏడాదికి పది మాత్రమే వస్తాయి. మిగిలిన 200 చిన్న సినిమాలకు టికెట్ రేట్లు వర్తించవు.. ఇండస్ట్రీ బాగుంటేనే అందరు బాగుంటారు. కానీ ఇండస్ట్రీలో నలిగిపోతున్న నిర్మాత పక్కన ఎవరు నిలబడరు. హక్కుల గురించి మాట్లాడేవారు.. బాధ్యతల గురించి కూడా చర్చించాలి' అని అన్నారు. నిర్మాత రాజేష్ దండా మాట్లాడుతూ..' నిర్మాతలకు కూడా రావాల్సిన పేమేంట్స్ ఉంటాయి.. కానీ కార్మికుల వేతనాలు ఏరోజు వేతనాలు ఆ రోజే ఇవ్వాలని , 30 శాతం పెంచాలంటున్నారు. ఓటీటీలు సైతం డబ్బులు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నాయి. నా గత సినిమాకు 250 వర్కర్స్ రావాల్సినా అంత మంది రాలేదు.. అప్పుడు ఫెడరేషన్ రెస్పాండ్ అవ్వలేదు..' అని అన్నారు. నిర్మాత చైతన్య రెడ్డి మాట్లాడుతూ..'మాకు నచ్చిన వారిని ఎందుకు మేము పెట్టుకోకూడదు.. సినీ ఎంప్లాయిస్‌కు నిర్మాతలు పని కల్పిస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో వేతనపెంపు భారమే. ప్రపంచ వ్యాప్తంగా ఏ వ్యాపారం సరిగ్గా నడవటం లేదు. పరిస్థితులకు తగ్గట్టుగా సర్దుకోవాల్సిన అవసరం ఉంది. ఏ నిర్మాతకు సినిమాల వల్ల డబ్బులు సంపాదించటం లేదు. ఎవరు హ్యాపీగా లాభాల్లో లేరు.. కేవలం సినిమా మీద ప్యాషన్‌తోనే పని చేస్తున్నాం. బాహుబలి , పుష్ప , హనుమాను లాంటి గొప్ప సినిమాలు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి వస్తున్నాయి. కానీ నిర్మాతల పరిస్థితి కూడా కార్మికులకు తెలుసు. మా పరిస్థితిని అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం.' అని అన్నారు.

## 'వార్ 2' బికినీ సీన్ కట్?

### ఊసురుమంటున్న ఫ్యాన్స్



జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ హీరోలుగా తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ మూవీ 'వార్ 2' ఆగస్టు 14న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో భారీ స్థాయిలో విడుదల కానుంది. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఇందులో హృతిక్ జోడీగా నటించారు. ఇటీవల విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుత స్పందన రావడంతో అంచనాలు మరింత పెరిగాయి. అయితే సినిమా విడుదలకు మూడు రోజుల ముందు సోషల్ మీడియాలో ఓ వార్త చర్చనీయాంశమైం ది. కియారా అద్వానీ బికినీలో కని పించే సన్నివేశాలకు సెన్సార్ బోర్డు కత్తెర వేసినట్లు సమాచారం. మూడు భాషల్లో నూ యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వడానికి 9 సెకన్ల సన్నివేశాన్ని తొలగించాలని సెన్సా ర్ సభ్యులు సూచించినట్టు ప్రచారం. లేకపోతే 'ఎ' సర్టిఫికెట్ ఇవ్వాల్సి వచ్చేదని చెబుతున్నారు. టీజర్, సాంగ్ ద్వారా ఆ సీన్స్ ఇప్పటికే వైరల్ కావడంతో తొలగించినా ఇబ్బంది ఉండదని మేకర్స్ భావించినట్టు తెలుస్తోంది.హిందీ వెర్షన్ నిడివి 2 గంటల 53 నిమిషాలు 24 సెకన్లు కాగా, తెలుగు, తమిళ వెర్షన్లు 2 గంటల 51 ని మిషాలు 44 సెకన్లుగా ఉన్నాయని సమా చారం. అంటే హిందీ కంటే తెలుగు వెర్షన్ రెండు నిమిషాల తక్కువగా ఉండనుంది.



## బిగ్ బీ సినిమాను వదులుకున్న దీపికా పదుకొణె

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె ఓ బిగ్ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఆమె మరో పెద్ద సినిమాను వదులుకున్నట్లు సమాచారం. తాను నటించనప్పటికీ ఈ సినిమాలో దీపికా భాగం కావడం విశేషం. అమెరికన్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్'ను హిందీలో రీమేక్ చేయాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని రీమేక్ హక్కులను దీపికా తన సొంత నిర్మాణ సంస్థ 'క-ప్రొడ క్షన్స్'పై 2020లోనే సొంతం చేసుకు న్నారు. అయితే ఆ తర్వాత కొవిడ్ రావడం తో ఇది పట్టాలెక్కలేదు. తాజాగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందు కు తెచ్చేందు కు సన్నాహాలు చేస్తున్నారు. ఈ రీమేక్‌ను ప్రకటించినప్పుడు ఇందులో రిషికపూర్ ప్రధానపాత్రలో తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. అయితే ఆయన 2020లో మరణిం చడంతో ఆ స్థానంలో అమితాబ్ నటించనున్నట్లు తెలిపారు. ఇందులో దీపికా కీలకపాత్రలో కనిపించనున్నట్లు టీమ్ అప్పట్లో ప్రకటించింది. తాజాగా ఆమె ఈ సినిమా నుంచి వైదొలగినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ సినిమాలో దీపికా నటించనప్పటికీ తన బ్యానర్ పైనే నిర్మించనున్నట్లు సమాచారం.

## మళ్లీ రెచ్చిపోయిన

# దృశ్యం పాప


### ఎస్తర్ అనిల్ వెకేషన్ లుక్స్



ఎస్తేర్ అనిల్.. ఈ మలయాళీ ముద్దుగుమ్మ.. తొలుత చైల్డ్ ఆర్టిస్టుగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. 2010లో నల్లవన్ అనే చిత్రం ద్వారా మలయాళ ఇండస్ట్రీలోకి అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మూడేళ్లకు దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించిన 'దృశ్యం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. మలయాళంతో పాటు తమిళ, తెలుగు వెర్షన్లలో తెరకెక్కిన దృశ్యం మూవీలో నటించింది ఈ చిన్నది.

తమిళ, మలయాళ భాషల్లో పలు చిత్రాల్లో నటించిన ఈ భామ.. హీరోయిన్‌గా ఇటీవల తమిళంలో మిన్మిని అనే చిత్రం చేసింది. అటు బుల్లితెరపై 2018లో టాప్ సింగర్ అనే షోకి హోస్ట్‌గా వ్యవహరించింది. ప్రస్తుతం హీరోయిన్ లుక్‌లోకి మారిపోయిన ఈ భామ.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ.. కుర్రకారును ఆకట్టుకుం టోంది. బికినీలో అందాల ఆరబోత చూపిస్తూ ఫ్యాన్స్‌కు నిద్రలేకుండా చేస్తోంది. కాగా, ఈ బ్యూటీ ఇన్‌స్టా ఫోటోలపై లైకులు వెల్లువెత్తుతున్నాయి.

# ముగిసిన రానా ఈడీ విచారణ



టాలీవుడ్ హీరో దగ్గుబాటి రానా ఈడీ విచారణ ముగిసింది. ఆయనను దాదాపు నాలుగు గంటల పాటు ఈడీ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా తన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన లావాదేవీలను ఈడీ అధికారులకు రానా అందించారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడకుండానే రానా వెళ్లిపోయారు. కాగా.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్ కేసులో టాలీవుడ్ నటుడు దగ్గుబాటి రానా. ఇవాళ ఈడీ విచారణకు హాజరయ్యారు. అయితే గతంలోనే హాజరు కావాల్సి ఉండగా.. తన ముందస్తు బిజీ షెడ్యూల్ కారణంగా రాలేకపోయారు. ఈడీని కాస్త సమయం కోరడంతో ఆగస్టు 11వ తేదీన ఈడీ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించింది. దీంతో సోమవారం విచారణకు హాజరై ఈడీ అధికారులకు వివరణ ఇచ్చారు. అలాగే ఈ బుధవారం అంటే 13వ తేదీన మంచు లక్ష్మి హాజరు కావాల్సి ఉంది. ఇదే కేసులో ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్, హీరో విజయ్ దేవరకొండ హాజరయ్యారు. తమ వెర్షన్ చెప్పుకొచ్చారు. ప్రకాశ్ రాజ్‌ని 6 గంటలు విచారించగా, విజయ్ దేవరకొండని అధికారులు 4 గంటల పాటు విచారించారు.

## గ్లామర్ డోస్ పెంచేసిన

# హైదరాబాదీ బ్యూటీ



టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ క్రేజ్ సొంతం చేసుకున్న హీరోయిన్లలో ఫరియా అబ్దుల్లా ఒకరు. ఫస్ట్ మూవీ నుంచే తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ తో అందరి దృష్టిని ఆకర్షించింది. కేవలం కామెడీ రోల్స్ మాత్రమే కాకుండా గ్లామర్ లుక్స్ లోనూ కట్టిపడేసిందిఈ వయ్యారి భామ. సోషల్ మీడియాలో నిత్యం క్రేజీ ఫోటోస్ షేర్ చేసే ఫరియా.. తాజాగా చీరలో గ్లామరస్ ఫోటోస్ పంచుకుంది. ట్రాన్స్ పరెంట్ స్టైలిష్ చీరలో ఫరియా వేసిన హావభావాలు అద్భుతంగా ఆకర్షిస్తున్నాయి. మత్స్యకన్య వైబ్స్ అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ కు తగ్గట్టే.. ఆమె లుక్ మరింత అందంగా కనిపిస్తుంది. చీరతోపాటు స్లీవ్ లెస్ బ్లౌజ్, లాంగ్ హెయిర్, కాంతివంతమైన మేకప్ ఆమె లుక్ ను మరింత హైలెట్ చేస్తున్నాయి. కెమెరా ముందు సునాయాసంగా ఇచ్చిన ఫోజులు చూసి ఫ్యాషన్ ప్రేమికులు ఫిదా అవుతున్నారు. మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది ఫరియా.ఆ తర్వాత పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆ స్థాయిలో హిట్స్ అందుకోలేకపోయింది. అయినా స్క్రీన్ ప్రెజన్స్, డ్యాన్సింగ్ స్కిల్స్ కామెడీ టైమింగ్ తో జనాల హృదయాలను గెలుచుకుంది. సినిమాలతోపాటు పలు ఓటీటీ ప్రాజెక్టులలోనూ మెరిసిం ది. ప్రస్తుతం గుర్రం పాపిరెడ్డి సినిమాలో నటిస్తుంది ఈ చిన్నది. అందం, అభినయంతో కట్టిపడేస్తోన్న ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు మాత్రం అంతగా రావడం లేదు. దీంతో నిత్యం గ్లామరస్ లుక్స్ తో పాటు ట్రెడిషనల్ డ్రెస్స్ లో కనిపిస్తుంది ఈ అమ్మ డు. తాజాగా ఈ ముద్దుగుమ్మ లేటేస్ట్ ఫోటోస్ వైరలవుతున్నాయి.

RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644. Web: shenarthimedia.in, Epaper:epaper.shenarthimedia.in